## కాకతీయ ఓఎస్‌డిగా వెంకట్రామ్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వరంగల్,ఏప్రిల్7 : కాకతీయ విశ్వవిద్యాలయ ఆఫీసర్ అన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా, భౌతికశాస్త్ర విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ బి.వెంకట్రామిరెడ్డి నియమితులయ్యారు. ఒక సంవత్సర కాలానికి నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డిని పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు అభినందించారు. ప్రస్తుతం వెంకట్రామిరెడ్డి టీజీఎడ్‌సెట్ కన్వీనర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.


Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి


## మొక్క కొనుగోలు కేంద్రం ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 7: కూసుమంచి మండలంలోని జీర్ల చెరువులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురాంరెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు నుంచి మొక్కజొన్నను కొనుగోలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. చేగుమ్మ సహకార సంఘం పరిధిలోని పలు గ్రామాల్లో ఉప కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి గంగాధర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


సంపుటి: 16 | సంచిక: 319 | కరీంనగర్ | బుధవారం 8 ఏప్రిల్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00


## విజయన్, మోడీ
# మంచి మిత్రులు



- రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్
- కేరళంలో ఇక ఎల్‌డిఎఫ్‌కు కాలం చెల్లింది
- ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

తిరువనంతపురం,ఏప్రిల్7 :కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి మధ్య ఒప్పందం ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్

11లో

## యూరియా యాప్‌పై
# హర్షం వ్యక్తం చేసిన రైతులు

- యూరియాను శాస్త్రీయంగా వాడాలి
- అధిక వాడకం వల్ల భూసారం తగ్గిపోతుంది
- మంత్రి తుమ్మల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్7 :దేశంలోనే అధికంగా యూరియా వాడుతున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఉందని, ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు యూరియాను అధికంగా వినియోగించవద్దని కోరారు. యూరియాను అధికంగా వాడటం వల్ల, నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు, రానురాను దిగుబడులు కూడా తగ్గుతాయని, చీడ పీడల సమస్యలు పెరుగుతాయని తెలిపారు. ఇప్పుడు పంటల కోతల సమయం వచ్చిందని, రైతులు కోతల అనంతరం వచ్చే పంట వ్యర్థాలను కాల్చవద్దని అన్నారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. ప్రతి మంగళవారం



నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా.. ఈ రోజు నిర్వహించి రైతునేస్తం కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి సచివాలయం నుండి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రిగారు.. యూరియా యాప్ మరియు యూరియా వినియోగం వంటి అంశాలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతునేస్తం కార్యక్రమంలో రైతులు అధికంగా పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. యూరియా యాప్ పై రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యూరియా

11లో

## ఆరు గ్యారెంటీలు
# 900 రోజులైనా ఏవీ

- పరిగిలో భూములు లాక్కునే యత్నం
- సిఎం రేవంత్‌పై విరుచుకుపడ్డ హరీష్ రావు
- పరిగి వెళుతున్న హరీష్ రావు తదితరుల అరెస్ట్
- శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 7 :పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు చెరిగారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మళ్లీ నిప్పులు చెరిగారు. మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు.

11లో






## కాంగ్రెస్ కోసం
# సైనికుల్లా పనిచేయాలి

- బిఆర్ఎస్, బిజెపిలకు అధికారం కల్ల
- నాగర్ కర్నూలు కాంగ్రెస్ కార్యక్రంలో పిసిసి చీఫ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నాగర్ కర్నూల్,ఏప్రిల్7 : తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి

11లో

## ఐపీఎల్ పేరుతో
# ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు

- బెట్టింగ్ యాప్ ఉచ్చులో పడకండి
- నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్7 : ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగి పోతున్నాయని... ఈ ఉచ్చులో పడవద్దని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీపీ స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్ ఛానెల్స్ దందా చేస్తున్నాయని.. టాస్, మ్యాచ్ ఫలితాలు ముందే చెబుతామని అమాయకులను బెట్టింగ్ ఉచ్చులోకి లాగుతూ మోసం చేస్తున్నాయని సీపీ తెలిపారు.



ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా ఈ అసత్య ప్రచారాల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ ఫేక్ ప్రిడిక్షన్ ఛానెల్స్.. ముందుగా ఎన్‌రోల్ చేయించి, తర్వాత బెట్టింగ్ యాప్‌ల లింకులు పంపి మోసం చేస్తున్నాయని సజ్జనార్ అన్నారు. బెట్టింగ్ వల్ల కష్టపడి సంపాదించిన డబ్బును అమాయకులు కోల్పోతున్నారని ఆయన చెప్పారు. ఫేక్ ప్రిడిక్షన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని సీపీ హెచ్చరించారు. ఫేక్ ప్రిడిక్షన్‌లు, బెట్టింగ్‌లపై

11లో

# రైతుల భూములు లాక్కునే యత్నం దుర్మార్గం



- ఇండస్ట్రియ్ పార్క్ పేరుతో భూ దందా
- బిఆర్ఎస్ నేతలను నిర్బంధించడం దుర్మార్గం
- హరీష్ రావు తదితరుల అరెస్ట్‌పై కెటిఆర్ ఆగ్రహం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 7 : ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి పేదల భూములపై పడిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, ఇతర నేతల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని ఆయన అభివర్ణించారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయకుండా రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూ సేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం

11లో

## తెలంగాణలో
# మావోయిస్టుల శకం ముగిసింది

- కర్రెగట్టుల్లో స్వేచ్ఛగా తిరిగే వెసలుబాటు
- మావోయిస్టు అడ్డాల్‌ఓ అభివృద్ధి పరుగులు
- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు,ఏప్రిల్7 : తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసిందని డిజిపి శివధర్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు తుపాకుల మోతతో, అశాంతితో నిండిన తెలంగాణ అటవీ ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి గీతం వినిపిస్తోంది. దశాబ్దాల కాలంగా మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు

11లో

# రైతులను పరామర్శించకుండా అడ్డుకుంటారా

- ఇంత నిరంకుశంగా వ్యవహరించడం సరికాదు
- హరీష్ రావు అరెస్ట్‌ను ఖండించిన బిఆర్ఎస్ నేతలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 7 : పరిగి పర్యటనకు వెళ్లకుండా బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును అడ్డుకోవడాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. హరీశ్‌రావు గృహ నిర్బంధం అక్రమమని మండి పడ్డారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని తెలిపారు. తప్పు చేయకుంటే ఈ సర్కార్‌కు భయమెందుకు అని ప్రశ్నించారు. రైతుల పక్షాన పోరాడితే అడ్డుకుంటారా నిలదీశారు. అధికారం చేతిలో ఉందని

11లో

# ఐటీ కారిడార్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

- 12 వందల కోట్ల విలువైన 8 ఎకరాలు స్వాధీనం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్7 : ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది . మంగళవారం ఖానామెట్ లో రూ. 12 వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..ఐటీ కారిడార్ కు చేరువలోని ఖానామెట్ లో 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించింది హైడ్రా. స్థానికుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణల కూల్చివేత చేపట్టారు. హైడ్రా

11లో

# వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం - ఇద్దరు వార్డెన్ల సస్పెన్షన్

## జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశం





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 7 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం పర్యటిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు, వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు, విద్యార్థుల సంక్షేమం, ఆహార నాణ్యత, పరిశుభ్రతపై సమగ్రంగా పరిశీలించి లోపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు, మౌలిక వసతులను పరిశీలించిన కలెక్టర్, ఆసుపత్రి పరిధిలో ప్రైవేట్ అంబులెన్స్ కార్యకలాపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో నిర్లక్ష్యం వల్ల రోగి మరణించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డయాలసిస్ కేసులు అధికంగా ఉండటంపై అధ్యయనం చేయాలని, మందులు, అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉంచాలని సూచించారు. ట్రైబల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహంలో ఆహార నాణ్యత, మెనూ అమలు లోపాలు గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకుని భవనం మరమ్మతులు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ట్రైబల్ వెల్ఫేర్ బాలుర పాఠశాలలో మెనూ పాటించకపోవడం, పరిశుభ్రత లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వార్డెన్ భరత్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహంలో వార్డెన్ గైర్హాజరు గమనించి మరొక వార్డెన్‌పై కూడా సస్పెన్షన్ చర్యలు తీసుకోవాలని సూచించారు. బీసీ బాలుర వసతి గృహంలో భోజనం ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేసి విద్యార్థులకు సమయానికి నాణ్యమైన ఆహారం అందించాలని హెచ్చరించారు. వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన ఇద్దరు వార్డెన్లను సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదేశిస్తూ, విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ హర్షవర్ధన్, ఆర్ఎంఓ రామ్ నివాస్, డ్యూటీ డాక్టర్ ప్రత్యూష, వసతి గృహాలు వార్డెన్లు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

**- నిర్లక్ష్యం వహించినా, డబ్బులు ఆశించినా కఠిన చర్యలు - పోస్టుమార్టం ప్రక్రియలు పూర్తిగా ఉచితం - ఎవరూ డబ్బులు తీసుకోకూడదు - ఆసుపత్రిలో పరిశుభ్రత, సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి -అవసరమైన పరికరాలు, సిబ్బందిని సమకూర్చి సేవలను విస్తరించాలి - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 07 : ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించాలని, ఆసుపత్రి విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, డబ్బులు ఆశించినా కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గోదావరిఖని జనరల్ ఆసుపత్రి పని తీరుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ , రామగుండం నగరపాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామితో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి రోగికి సమయానికి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ స్టాక్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగుల సౌకర్యాల కోసం గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆర్.ఓ ప్లాంట్ ఏర్పాటు, ఆసుపత్రి అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, రోగులు, వారి సహాయకుల కోసం అదనపు షెడ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. సదరం శిబిరాన్ని ప్రత్యేక భవనానికి మార్చినట్లు తెలిపారు. అదే విధంగా జిల్లా మెడికల్ బోర్డు తరలింపును కూడా సమగ్ర ప్రణాళికతో అమలు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని విభాగాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్యులు సమయానికి హాజరు కావడం నిర్ధారించుకోవాలని, వివిధ విభాగాలలో ఉన్న ఖాళీలను అవుట్‌సోర్సింగ్ విధానంలో త్వరితగతిన భర్తీ చేయాలని తెలిపారు. ఆసుపత్రి సేవలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో డయాగ్నస్టిక్ హబ్ ద్వారా ఆరోగ్య పరీక్ష ఫలితాల అందజేతలో పెద్దపల్లి జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. ఈ స్థాయిని మరింత మెరుగుపర్చేందుకు గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి అవసరమైన పరికరాల జాబితాను అంచనాలతో సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. ఈఎన్‌టి విభాగానికి సంబంధించి అవసరమైన పరికరాలు సమకూర్చి, ఓపీ సేవలు ఆలస్యం లేకుండా రోగులకు అందించాలని సూచించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకంపై ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో లిఫ్ట్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వార్డులకు సంబంధించిన వైద్యులు ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు తీసుకోకుండా ఉచిత వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. పోస్టుమార్టం ప్రక్రియలు పూర్తిగా ఉచితంగా జరగాలని, ఎవరైనా డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫోరెన్సిక్ విభాగంలో వైద్యుల కొరత ఉన్నందున అవసరానికి అనుగుణంగా సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి రోగికి ఉచితంగా మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి అందజేసిన 20 ఏసీలు, 23 ఫ్రిజ్‌లను రోగుల అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా వినియోగించుకోవాలని, రోగులు, వారి బంధువులు ఎవరూ నిల్చోకుండా అందరూ కూర్చునే విధంగా తగిన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి నుంచి వచ్చే బయోడిగ్రేడబుల్ చెత్త నిబంధనల ప్రకారం డిస్పోజ్ చేయాలని కలెక్టర్ సూచించారు. వివిధ విభాగాల హెచ్ఓడిలు ప్రతి నెలా ఎన్ని ఆపరేషన్లు చేస్తున్నారో రికార్డు అందించాలని కలెక్టర్ తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలి

## బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ ఛైర్మన్ సీత దయాకర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 7 : 0-18 వయస్సు గల పిల్లలకు మెరుగైన భవిష్యత్తు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సామాజిక బాధ్యతగా గుర్తెరిగి, సమన్వయంతో పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ ఛైర్మన్ సీత దయాకర్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి ఛైర్మన్ సీత దయాకర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యులు చందన, సరిత హాజరైనారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడతూ, జవహర్ నగర్ లోని పిల్లలను కాపాడడమే కాకుండా వారికి అవసరమైన మౌలిక సదుపాయాలైన విద్యా ,వైద్యం అందించడమే కాకుండా వారి బంగారు భవిష్యత్తుకు ఇప్పుడు మనం అందించే తోడ్పాటు రేపటి పునాది కావాలన్నారు. దీని కోసం జిల్లాయంత్రాంగం మొత్తం కలిసి కట్టుగా పని చేయాలని అన్నారు. అక్కడ ఉన్న సమస్యలను ప్రాధాన్యతగా తీసుకోని ఒక ప్రణాళిక ప్రకారం ఒక్కొక్కటిగా చేసుకుంటూ ముందుకు వెళ్దామన్నారు. బాలల హక్కులరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు వెళితే ఆ పిల్లలకు మంచి భవిష్యత్తును అందించగలుగుతామన్నరు. ఈ స్పెషల్ డ్రైవ్ అన్ని శాఖలు తమ తమ విధులను అంకితభావంతో పని చేయడమే కాకుండా, ఆ పిల్లలు మన పిల్లలే అనే ఆలోచనతో చేస్తే తప్పకుండా ఈ సమస్యను పరిష్కరించగలమన్నారు. అక్కడ ఉంటున్న పిల్లల వివరాలను సేకరించి అందులో స్కూలుకు వెళ్లని పిల్లల వివరాలను స్కూలు మానేసిన పిల్లల వివరాలను తనకు అందించాలని సూచించారు. అదేవిధంగా అక్కడ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆరోగ్యం పట్ల వారికి అవగాహన కల్పించాలన్నారు. అక్కడి పిల్లలకు కనీసం ఆధార్, బర్త్, కాస్ట్ సర్టిఫికేట్ లు లేని వారు చాలా మంది ఉన్నారని, వారికోసం అక్కడే ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి అందించాలని కీసర ఆర్డిఓను కోరారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, చైల్డ్ సెక్సువల్ అబ్యూస్, డ్రాపౌట్ వంటి అనేక సమస్యలు అక్కడ ఉన్నాయని జిల్లాయంత్రాంగం సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్దతో ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. అందుకుగాను ఏ విధంగా ముందుకువెళితే సమస్యలను పరిష్కరించగలమో అధికారులు వారి వారి అభిప్రాయాలను సలహాలను తెలియజేయాలన్నారు. చైల్డ్ లేబర్ చాలా మంది ఉన్నారని లేబర్ డిపార్ట్ మెంట్ వారిని గుర్తించి వివరాలు అందించాలని ఆదేశించారు. ఆపరేషన్ ముస్కాన్ తరహాలో ఇప్పుడు కూడా ఒక స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి చైల్డ్ లేబర్ ను గుర్తించాలన్నారు. అవసరమైతే సంబంధిత అధికారులకు, ఉన్నతాధికారుల దృష్టికి ఈసమస్యలను తీసుకువెళ్లి వారి సహాయ సహాకారాన్ని తీసుకొని సమస్యను పరిష్కరిద్దామన్నారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ,ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని ప్రణాళికబద్ధంగా ప్రాధాన్యతను బట్టి ఆయా ప్రాంతాలలోని పిల్లలకు కావలసిన సదుపాయాలను అందిస్తూ ఆ వాతావరణం నుండి బయటకు తీసుకురావడానికి కావలసిన చర్యలను అన్ని శాఖలు, ఎన్జీఓల సమన్వయ సహాకారంతో నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రతి సమస్యకు వేర్వేరు కారణాలు ఉంటాయి, కాబట్టి వాటి పరిష్కారాలు కూడా వేర్వేరుగా ఉంటాయి. ఈ ఏప్రిల్ నెలలో అంగన్‌వాడీల ద్వారా ఫ్యామిలీ సర్వే జరుగుతుంది కాబట్టి, ఆ డేటాను కూడా మనం క్రాస్ వెరిఫై చేసుకోవడానికి ఉపయోగపడడమే కాకుండా వారి సామాజిక-ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడానికి దోహదపడుతుందన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహణలో భాగంగా విద్యా, వైద్య, లేబర్, మహిళ శిశు సంక్షేమ, బిసి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలు, పోలీసు, ఎక్సైజ్, పరిశ్రమలు,రెవెన్యూ, డిఆర్డిఓ, డ్రగ్ కంట్రోల్ తదితర శాఖల కార్యాచరణ ప్రణాళికలను అడిగి తెలుసుకొని, కావలసిన సలహాలను సూచనలను అందించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఎన్జీఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మేడ్చల్ మల్కాజిగిరి ఏప్రిల్ 7 : సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్ లోని మారుతి మెడికల్ హాల్ వద్ద పుప్పాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు ద్వారా పేద ప్రజలకు సేవలను అందిస్తున్న పుప్పాల ఫౌండేషన్ డైరెక్టర్ మరియు డివిజన్ ప్రెసిడెంట్ పుప్పాల భాస్కర్, మల్లారెడ్డి ఇన్స్టిట్యూట్స్ యాజమాన్యానికి నా అభినందనలు, ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఏ ఉచిత వైద్య శిబిరాన్ని నిరుపేదలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం బస్తీలోని హరి హర క్షేత్రం శివాలయం నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్, సీనియర్ నాయకులు మధుమోహన్, ఫెరోజ్, సాజిత్, ప్రశాంత్, బషీరుద్దీన్, ప్రభుదాస్, రవి, ముకుందం, ప్రభుదాస్, కోల శ్రీకాంత్, హేమలతా రెడ్డి, లావణ్య, ధనలక్ష్మి, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్టీసీ లక్ష్మీనారాయణ, భద్రప్ప, సంజీవరెడ్డి, వరప్రసాద్, అనిల్, రవితేజ, సుమన్, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# కూల్చివేతల బాధితుల పక్షాన బీఆర్ఎస్ సమరం

## మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హెచ్చరిక


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 07 : కూల్చివేతల కారణంగా నష్టపోయిన బాధితుల పక్షాన ఇక సమరం తప్పదని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ స్పష్టం చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు గోపు ఐలయ్య యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రామగుండంలో ఎమ్మెల్యే అనాలోచితంగా చేపట్టిన కూల్చివేతల వల్ల గత రెండేళ్లుగా వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయారని, ముఖ్యంగా చిరు వ్యాపారులు రోడ్డున పడిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి సమయంలో దొంగల్లా కూల్చివేతలు చేపట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ఈ విధానాలు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌కే సాధ్యమని ఎద్దేవా చేశారు. కూల్చివేతలతో నష్టపోయిన ప్రతి ఒక్కరి పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిలబడి పోరాటాలు చేస్తుందని చందర్ తెలిపారు. బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసులు అధికార పార్టీకి పాలేర్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాధితుల గోసకు తప్పకుండా న్యాయం జరుగుతుందని, రాబోయే రోజుల్లో ఇందుకు సంబంధించి బాధ్యులు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. రామగుండంలో కూల్చివేతలపై బాధితుల తరఫున ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఇంకా ఈ సమావేశంలో కార్పొరేటర్ మేకల సమ్మయ్య, బీఆర్ఎస్ నాయకులు బొడ్డు రవీందర్, మూల విజయా రెడ్డి, నడిపెల్లి మురళీధర్ రావు, మెతుకు దేవరాజు, అచ్చె వేణు, నీరటి శ్రీనివాస్, తిమోతి, దొమ్మేటి వాసు, తోకల రమేష్, నూతి తిరుపతి, కల్వచర్ల కృష్ణవేణి, గుర్రం పద్మ తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో కెఎఫ్‌సిలో కుళ్లిన చికెన్ కలకలం

**- స్పందించని ఫుడ్ ఇన్స్పెక్టర్‌పై ప్రజల ఆగ్రహం**
**- కెఎఫ్‌సి ఘటనపై తక్షణ చర్యలు కోరుతూ ప్రజల డిమాండ్**
**- జిల్లాకు ఫుడ్ ఇన్స్పెక్టర్ "ఉన్నట్టా లేనట్టా?"**

(ప్రజాలక్ష్యం బ్యూరో)




మంచిర్యాల ఏప్రిల్ 7 : మంచిర్యాల పట్టణంలోని కె.ఎఫ్.సి రెస్టారెంట్‌లో కుళ్లిపోయిన చికెన్ విక్రయించారన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర కలకలం రేపాయి. ఈ ఘటనతో పట్టణ ప్రజల్లో ఆహార భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల ప్రకారం, లక్ష్మణ్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి కె.ఎఫ్.సి రెస్టారెంట్‌కు వెళ్లి చికెన్ లాలిపాప్ ఆర్డర్ ఇచ్చారు. ఆర్డర్ అందుకున్న తర్వాత ఆహారాన్ని పరిశీలించిన ఆయన, చికెన్ కుళ్లిపోయినట్లు గుర్తించినట్లు తెలిపారు. అయితే అప్పటికే పిల్లలు కొంత భాగం తినడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ విషయంపై రెస్టారెంట్ సిబ్బందిని ప్రశ్నించగా వారు నిర్లక్ష్యంగా స్పందించినట్లు బాధితుడు ఆరోపించారు. వెంటనే ఆయన 100 నంబర్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఫుడ్ ఇన్స్పెక్టర్ స్పందించకపోవడం, హోటళ్లలో నియమిత తనిఖీలు జరగకపోవడంపై భోజన ప్రియులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "మంచిర్యాలకు ఫుడ్ ఇన్స్పెక్టర్ ఉన్నట్టా, లేనట్టా? ఉన్నా కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారా?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలోని హోటళ్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నాణ్యత లేని ఆహారం విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉండగా, అధికారుల చర్యలపై ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


# అత్యుత్తమ వైద్య సేవలతో ప్రజల మన్ననలు పొందాలి

## - కలెక్టర్ చిత్రా మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కరీంనగర్, ఏప్రిల్ 07: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా హుస్సేన్‌పురాలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (ముంతాజ్ ఖానా)ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆమె ఆరా తీశారు. రోజువారీ పేషెంట్ల సంఖ్య, మందుల లభ్యత, ల్యాబ్ పరీక్షల నిర్వహణ, గర్భిణీ స్త్రీలకు అందుతున్న సేవలపై వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి సేవలపై అభిప్రాయాలను సేకరించారు. వైద్య సిబ్బంది అత్యుత్తమ సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల ప్రతిష్టను పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు వైద్యులను దేవుళ్లుగా భావిస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టేలా సేవలు అందించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల్లో విశ్వాసం పెంచాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధునాతన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని వినియోగించుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని, వైద్య సిబ్బంది ఓర్పుతో సేవలు అందించి మంచి గుర్తింపు పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ, పీఓ ఎంహెచ్ఎన్ సనా, మెడికల్ ఆఫీసర్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



# అవార్డు పొందిన కామారం సబ్ సెంటర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 07 : రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ సేవలందించినందుకు కోమట్ల గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కామారం సబ్ సెంటర్‌కు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తు చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి అవార్డు ప్రదానం చేయబడింది. ఈ అవార్డు, గర్భిణీ స్త్రీల ముందస్తు నమోదు, నాలుగు తప్పనిసరి ఎ ఎన్ సి పరీక్షలు, పూర్తి రోగనిరోధక టీకాలు కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కామారం సబ్ సెంటర్ చూపిన విశిష్ట ప్రతిభకు గుర్తింపుగా లభించిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ మహబూబాబాద్ కామారం సబ్ సెంటర్ సిబ్బందిని మంగళవారం అభినందించి,వారి కృషి ఇతర ఆరోగ్య కేంద్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో తల్లి-శిశు ఆరోగ్య సేవలను మెరుగుపరచడంలో సిబ్బంది నిబద్ధత ప్రశంసనీయమని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన ఆశా కార్యకర్తలు,ఎ ఎన్ ఎం, సంబంధిత సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలను కొనసాగిస్తూ ప్రజల ఆరోగ్యానికి మరింతగా తోడ్పడాలని ఆకాంక్షించారు.

# విద్య, వైద్యం, మౌలిక వసతులపై సమగ్ర తనిఖీలు

## - అశ్వరావుపేటలో జిల్లా కలెక్టర్ అంకిత్ పర్యటన



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 7 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృతంగా పర్యటించి పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రతిపాదిత 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల' స్థలాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, మౌలిక వసతులపై సమగ్రంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మొదటగా తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించి నాణ్యతను సమీక్షించారు. డైనింగ్ హాల్, స్టోర్ రూమ్ నిర్వహణను పరిశీలిస్తూ నిల్వ ఉంచిన బెల్లం నాణ్యతపై సందేహం వ్యక్తం చేసి సరఫరా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే చింతపండు, కూరగాయల నాణ్యతను కూడా తనిఖీ చేసి ఎల్లప్పుడూ తాజా, నాణ్యమైన ఆహారం మాత్రమే విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించే ఆహారాన్ని ముందుగా పూర్తిగా పరిశీలించిన తర్వాతే అందించాలని, ఇందుకు 8, 9, 10వ తరగతి విద్యార్థులను కూడా ఆహార పరిశీలనలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. మెనూ ప్రకారం పోషకాహారం అందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని స్పష్టం చేశారు. అనంతరం 6వ, 7వ తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, ఆహార నాణ్యత, చికెన్ ఎన్ని సార్లు ఇస్తున్నారన్న అంశాలతో పాటు ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా అని సిబ్బందిని ప్రశ్నించారు. గ్యాస్ సరఫరా, వంటశాల నిర్వహణ, పరిశుభ్రతపై వివరాలు తెలుసుకుని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సరిపడా నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. జిల్లాలో కొన్ని చోట్ల మెనూ పాటించని పరిస్థితులు తమ దృష్టికి వచ్చాయని పేర్కొంటూ అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అనంతరం అశ్వరావుపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్, ఔట్‌పేషెంట్ విభాగం, వార్డులు, రక్త పరీక్ష కేంద్రం, మందుల నిల్వ గదులను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, కొరత ఉంటే వెంటనే ఇండెంట్ చేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీ సేవల విభాగాన్ని పరిశీలిస్తూ అర్హులైన ప్రతి రోగికి సమయానికి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కానింగ్, ఎక్స్‌రే విభాగాల్లో సేవల్లో ఆలస్యం జరుగుతున్నట్లు గుర్తించి దానికి గల కారణాలను తెలుసుకున్నారు. రేడియాలజీ టెక్నీషియన్ల కొరత ఉన్నట్లు తెలిసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇన్‌పేషెంట్ వార్డుల్లో రోగులకు అందించే ఆహారాన్ని పరిశీలించి, ఆహారం తయారీ ప్రదేశాన్ని కూడా తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతి రోగికి ఆహారం కోసం చెల్లిస్తున్న నిధులపై కాంట్రాక్టర్ను ప్రశ్నించగా రోజుకు రూ.80 చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈ మొత్తానికి అనుగుణంగా నాణ్యమైన ఆహారం అందించడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. రోగులకు ఇవ్వాల్సిన పోషకాహారంలో అరటిపండ్లు, గుడ్లు లేకపోవడాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. వైద్యశాఖ అధికారులు రోగుల ఆహారంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలనిఆదేశించారు.తదుపరి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల' స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, స్థలం విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, చేరువ మార్గాలు, మౌలిక వసతుల లభ్యత వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట తహసీల్దార్ కిషోర్, ఎంపీడీవో అప్పారావు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఆర్ఎంఓ మౌనిక, ప్రధానోపాధ్యాయురాలు సంగీత తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలు రేషన్ సరుకులను సద్వినియోగం చేసుకోవాలి

## - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

## - మాందారిపేటలో నూతన రేషన్ దుకాణం ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 7 : భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలం మాందారిపేట గ్రామంలో నూతన రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. బడిగే అశోక్‌కు కేటాయించిన ఈ రేషన్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం గ్రామంలో ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం పేద ప్రజలకు నిత్యావసర సరుకులను సమయానికి, పారదర్శకంగా అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. గ్రామ స్థాయిలో రేషన్ దుకాణాల ఏర్పాటు ద్వారా ప్రజలకు సులభంగా సరుకులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మాందారిపేట గ్రామంలో కొత్తగా ప్రారంభమైన ఈ రేషన్ దుకాణం ద్వారా స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు కూడా రేషన్ సరుకులను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డిఓ, శాయంపేట ఎమ్మార్వో, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.









# ఖనిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 7 : గోదావరిఖని పట్టణం జవహర్ నగర్‌లోని ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్య క్రమాన్ని 54వ డివిజన్ కార్పోరేటర్ ఎండీ ముస్తఫా ఆధ్వర్యంలో నిర్వహించగా, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ , నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య లు హాజయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ , మేయర్ మహంకాళి స్వామి , డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య తో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పోరేటర్లు, , నాయకులు, కార్యకర్తలు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



# మళ్లీ వచ్చేది... కాంగ్రెస్ ప్రభుత్వమే..!

## - కాళేశ్వరం ప్రాజెక్ట్ పై బీఆర్ఎస్ చెప్పేవన్నీ అభద్దాలే - బీఆర్ఎస్ కథ ఇక ఒడిసిన ముచ్చటే - కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితం - కవిత సొంత కుంపటి పెట్టుకుంటోంది - కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజల మద్దతు - నాగర్ కర్నూల్‌లో సంఘటన్ శ్రీజన్ అభ్యయన్ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నాగర్ కర్నూల్, ఏప్రిల్ 7 : తెలంగాణలో మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ పార్టీ కథ ఇక ఒడిసిన ముచ్చటేనని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన సంఘటన్ శ్రీజన్ అభ్యయన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కథ ముగిసే దశకు చేరుకుందని, మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రస్తుతం ఫామ్ హౌస్‌కే పరిమితమయ్యారని ఆరోపించారు. కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత తనదైన రాజకీయ దారిలో ముందుకు సాగుతూ సొంత పార్టీ పెట్టుకుంటోందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించిందని, లక్షల ఎకరాలకు నీరు అందించామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. వాస్తవానికి చాలా తక్కువ ప్రాంతానికే సాగునీరు అందిందని ఆయన విమర్శించారు. ఈ విషయాన్ని కేసిఆర్ సన్నిహితులే బయటపెడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు స్పష్టంగా బయటపడుతున్నాయని అన్నారు. ఇంకా బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని కలలు కంటోందని, కానీ ప్రజలు వారి పాలనను బాగా గుర్తుంచుకున్నారని అన్నారు. గత పదేళ్ల పాలనలో ప్రజలను ఇబ్బందులకు గురిచేసి, ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రావాలనుకోవడం సాధ్యం కాదని విమర్శించారు.

**వెయ్యి కోట్లతో నాగర్ కర్నూల్ నియోజకవర్గ అభివృద్ధి...**

గత పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని నాగర్ కర్నూల్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు, కమీషన్లు, దోపిడిలతో సర్వనాశనం అయిన నాగర్ కర్నూల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళ్తున్నామన్నారు. ఏ నాయకుడు చేయలేని విధంగా వెయ్యి కోట్ల రూపాయలతో నాగర్ కర్నూల్ ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు మద్దతు పెరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధికి పట్టం కడుతున్నామని అభివృద్ధి తోనే నియోజకవర్గ ప్రజలకు మరింత దగ్గరయ్యామని చెప్పారు. కార్యక్రమం లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు , సీడబ్ల్యూసీ మెంబర్ వంశీ చందర్ రెడ్డి , ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి , ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి. , మున్సిపల్ చైర్మన్ సునేంద్ర , మార్కెట్ కమిట్ చైర్మన్ రమణ రావు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా ఉండటమే తన లక్ష్యం

## ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 7 : ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ తమ లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు మంగళవారం అంతర్గాం మండల కేంద్రంలో 8 మంది లబ్ధిదారులకు 2 లక్షల 27వేల విలువ గల సీఎం రిలీఫ్ అండ్ చెక్కులను అందించి మాట్లాడారు. సీఎం సహాయ నిధి ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారందరికీ ఉపశమనం కలిగించడమే తన ఆలోచన విధానమని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం ఎంపీడీవో జి.తిరుపతి, అంతర్గాం టిటిఎస్ సర్పంచ్, అంగోత్ రవి నాయక్ ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.





# నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

## - పెండింగ్ కేసులపై సమగ్ర సమీక్ష - రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 7 : రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు,వారెంట్ల అమలు,పోలీస్ సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం త్వరితగతిన అందేలా న్యాయాధికారులతో సమన్వయం పాటించాలని సూచించారు. దొంగతనాల నివారణ, కేసుల ఛేదనపై సమీక్షిస్తూ, నేరస్తులను పట్టుకోవడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని ఆదేశించారు. రికవరీ శాతం పెంచి బాధితులకు వారి సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చోరీలకు పాల్పడే వ్యక్తులపై హిస్టరీ షీట్లు తెరవాలని తెలిపారు. చోరీలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని,ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు,కాలనీలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును స్టేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం పాటిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "అరైవ్-అలైవ్" కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచాలని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు,వృద్ధుల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి,వారి ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు. పెట్రోలింగ్ మరియు బ్లూ కోల్ట్స్ వాహనాలతో పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు,జూదం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్,జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీఐలు, ,ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు


## - స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్న కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 07 : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా హవేలీఘనాపూర్ మండలంలోని సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పలు ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. Together for Health -- Stand With Science అనే థీమ్‌ను ప్రస్తావిస్తూ,ప్రజలు శాస్త్రీయ దృక్పథంతో ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధుల లేమి మాత్రమే కాకుండా శారీరక,మానసిక, సామాజిక సంక్షేమం కలగలిపిన సమగ్ర స్థితి అని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో సమతుల ఆహారం తీసుకోవడం,నియమిత వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లను తప్పనిసరిగా అలవరచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించి,మిల్లెట్ ఆహారం,పండ్లు,కూరగాయలు అధికంగా తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా పరిగణించాల్సిన అవసరం ఉందని,ఒత్తిడి,ఆందోళనలను తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం వంటి పద్ధతులను అనుసరించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు,జీవనశైలి సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని,ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు,ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# పెద్ద కొడుకునై ఉంటా

## వనపర్తి శాసనసభ్యులు తుడి మేఘారెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, ఏప్రిల్ 7 : వనపర్తి నియోజకవర్గం లోని ప్రతి ఇంటికి తాను పెద్దకొడుకుగాహొ పని చేస్తానని, నియోజకవర్గ అభివృద్దే తన లక్ష్యమని చెప్పారు వనపర్తి శాసనసభ్య తూడి మేఘారెడ్డి వనపర్తి పట్టణంలో ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశాలకు ఆయనా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు తన తరఫునహొ పుట్టింటి కానుకగా నూతన వస్త్రాలను అందించి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 20వ వార్డుకు చెందిన 1. ఏర్పుల శాంతమ్మ గురువయ్య 2. రామేశ్వరమ్మ బాలస్వామి 15 వ వార్డు కు చెందిన అలివేల నరేందర్ 33 వ వార్డుకు చెందిన నస్రీన్ బేగం అబ్దుల్ రెహమాన్ గార్ల కుటుంబాలకు ఆయన నూతన వస్త్రాలను అందించారు. తమ సొంత ఇంటి కల నెరవేరుతుందో లేదో అని భయపడిన తమకు కాంగ్రెస్‌హొ ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఇచ్చి తమ సొంత ఇంటి కల నెరవేర్చినందుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నో రాజ్యాలు మారాయి రాజకీయ నాయకులు మారారు గాని ఒక ఇల్లు కట్టించలేదనీ కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు చేయూతనిస్తూ సొంత ఇంటిని ఏర్పాటు చేస్తుందని వారు చెప్పారు. ఈ సందర్భంగా సొంత ఇంటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, స్థానిక కౌన్సిలర్లు, పట్టణ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ప్రజాలక్ష్యం


సంపాదకీయం

## రాజకీయం కోసం అభివృద్ధికి మోకాలడ్డరాదు !

రాజకీయాలు వేరు... అభివృద్ధి వేరు. ఈ రెంటిని కలగలిపి చూస్తే..అభివృద్ధి వెనక్కి పోతుంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన విషయంలో ఇదే జరుగుతోంది. ఎపిలో అమరావతి విషయంలనూ ఇదే కనిపిస్తోంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇప్పుడు చూపిన నమూనా ప్రకారం ముందుకు వెళితే మంచి దే. అదేవిధంగా నిర్వాసితులకు ఉత్తమ ప్యాకేజీ, వారు ఆనందపడిపోయేలా ఉండాలి. ఇల్లుకు ఇల్లు, జాగాకు జగా అందాలి. మూసీని ప్రక్షాళన చేయడంలో ఎవ్వరికీ అభ్యంత రం ఉండదు. అలాగే మురుగనీటిని ఎలా, ఎక్కడికి తరలిస్తారన్నది కూడా పెద్ద సమస్య. హైదరాబాద్ మురుగు నీటిని ఇంతకాలం మూసీలో పారబోస్తున్నారు. దానికి ప్రత్యా మ్నాయం చూపాలి. ఇకపోతేమూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బిజెపిలు ప్రత్యామ్నాయాలు చూపడం లేదు. ఇలా చేద్దామని సలహాలు ఇవ్వడం లేదు. ఎందుకంటే ఇది రాజకీయం. రాజకీయాన్ని అభివృద్ధితో ముడిపెట్టడం వల్లనే మూసీ ప్రక్షాళనను ఈ రెండు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ తెలంగాణ అడుక్తికునేలా చేసింది. ఇలాంటి రాజకీయాల వల్లనే తెలంగాణ మరింత వెనకబా టుకు గురవుతుంది. ఇకపోతే అమరావతి విషయంలో జగన్, ఆయన అనుచరగణం చేస్తున్న విమర్శలు, రాజకీ యాలు చూస్తుంటే..ఇలాంటి నాయకులు ఉన్నందుకు సిగ్గుప డాలి. అమరావతి రాజధాని నిర్మాణం అవసరం. కానీ అసలు రాజధానే అవసరం లేదంటున్న వారు రాజకీయాల్లో ఉండ డానికి లేదు. 2019 ఎన్నికల్లో 151 సీట్ల భారీ మెజారిటీని జగన్ మోహన్ రెడ్డికి కట్టబెడితే చేసిందేమిటి. ఆనాడు మావిగన్ ఆలోచన ఎందుకు రాలేదు. ఆనాడు మడు రాజధా నులంటూ ఎందుకు ఊరేగారు. రాజధాని అవసరం లేదన్న వారు ఐదేళ్లు కాలయాపన చేశారు. అప్పటి నుంచి జగన్ రాజకీయ నిజస్వరూపం వెల్లడవుతూ వచ్చింది. ప్రజలకు ఆయన ఏమిటో బోధ పడింది. కక్షలు, కార్పణ్యాలు, అసూ యా ద్వేషాలతో ఐదేళ్లపాటు సాగించిన పాలనతో ప్రజలకు చైతన్యం వచ్చి ఉండాలి. ఎందుకంటే ఇలాంటి నేతను మోసి నందుకు సిగ్గుపడాలి. రాజకీయాల్లో వైఫల్యాలను గుణ పాఠా లుగా మలచుకొని ముందుకు సాగాలి. కానీ ఇక్కడ బిఆర్ఎస్, అక్కడ జగన్ పార్టీకి ఇవేవీ కానరావడం లేదు. ఇప్పటికీ ఈ రెండు పార్టీల నేతలకు జ్ఞానోదయం కావడం లేదు. వారికి కావలసిం దల్లా అధికార పీటం తప్ప, అభివృద్ధి కాదు. భజనపరులు చుట్టూ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ప్రజా వ్యతిరేకత కనిపించదు. ప్రజలకు డబ్బు పంచితే గంపగుత్తగా ఓట్లు పడతాయని లెక్కలు వేసుకున్న నేటి విపక్ష నేతలు ఆనాడు మళ్లీ తమదే అధికారం అని ఢంకా బజాయించారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలన చేయాలి. ఇప్పుడు రేవంత్ రెడ్డి అయినా అదే చేయా లి. ఎందుకంటే భూకబ్జాలపై వస్తున్న ఆరోపణలపై మేల్కో వాలి. వెంటనే ఖండించాలి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడిపై విపరీతమైనా ఆరోపణలు ఉన్నాయి. వీటిని ఖండించకపోవడంతో అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి. రేవంత్ ఇలాంటి విషయాలపై ఖచ్చితం గా లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఆయన కూడా మూసీలో కొట్టుకు పోవడం ఖాయం. నిర్మాణాత్మక పనులు ఇంకా రేవంత్ మొదలు పెట్ట లేదు. ఎంతసేపు రేషన్ కార్డులు, సన్నబియ్యం, చీరలు, ఫ్రీ బస్సు వంటివే కనిపిస్తున్నాయి. ఇవేవీ అభివృద్ధి కాదని గుర్తించాలి. ఇకపోతే ఆనాడు వైనాట్ 175 అన్న జగన్ ఇప్పుడు మళ్లీ మనదే అధికారం అంటున్నారు. తెలంగాణలో కెటిఆర్ కూడా అదే మాట్లాడుతున్నారు. ఎపిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావస్తోంది. ఇంకే ముందీ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఇక ఉన్నది రెండేళ్ల కాలమని, చివరి సంవత్స రం అంతా ఎన్నికలకే పోతుందని, తన పాదయాత్ర కూడా ఉంటుందని జగన్ నమ్మబలుతుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలను ప్రజలు మరచిపోరని ఏ పార్టీ అయినా గుర్తించాలి. అధజకారంలో ఉన్నప్పుడు జగన్‌కు మావిగన్ ఆలోచన రాలేదు. అంటే అమరావతి మీద ద్వేషం తో చేస్తున్నదే అని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. మహా నగరా లతో 'మావిగన్' పోటీ పడుతుందని ప్రచారం కూడా మొద లెట్టారు. రాజ్యాంగంలో రాష్ట్రాలకు రాజధాని అనే పదం లేదని జగన్ చెప్పడం చూస్తుంటే, ఇలాంటి వ్యక్తిని ఎందుకు ఆదరించాలో ప్రజలు కూడా ఆలోచించాలి. హైదరాబాద్ మహా నగరం నుంచి వస్తున్న ఆదాయంతోనే తెలంగాణ నడుస్తోంది. ఇప్పుడు రేవంత్ ఫ్యూచర్ సిటీ అంటున్నారు. ఇది సాధ్యామా అన్నది కూడా ఆలోచించాలి. నగరాలు వాటంతటే అవే రావాలి తప్ప, చేస్తే రావు. అరావతి వేరు... ఫ్యూచర్ సిటీ వేరు అని గుర్తించాలి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుతం విశాఖపట్నం నుంచి అధికంగా ఆదాయం వస్తోంది. అమరా వతి మహా నగరంగా అభివృద్ధి చెందితే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి, అందులో కొంత భాగాన్ని విక్రయించి ఆ డబ్బుతో మౌలిక వసతులు కల్పించబోతున్నారు. హైదరాబాద్ ఇప్పటి రూపం సంతరించుకోవడానికి మూడు దశాబ్దాలకు పైగా పట్టింది. అభివృద్ధి అనేది నిరంతర పక్రియ. సంకుచి తంగా ఆలోచించేవారు అభివృద్ధి గురించి ఆలోచించలేరు. అందుకే రాజకీయాలు వేరు. అభివృద్ధి వేరు. రాజకీయ పార్టీల నేతలకు దూరదృష్టి ఉండాలి. అభివృద్ధిపై అవగాహన ఉండాలి. వందేళ్ల ముందు గురించి ఆలోచించాలి. అంతేగాని రాజకీయాలతో వెనకేసుకుని బతుకుదామనుకునే వారు పాలకులు కాబోరు.

# ఆధునిక భారతంలో మను-వైదిక ఆధిపత్యం

## ఒక విశ్లేషణ



పిట్టల రవీందర్

1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు, అది కేవలం ఒక చట్టబద్ధమైన పత్రంగానే కాకుండా, "ఒక మనిషి – ఒకే విలువ" అనే విప్లవాత్మక సామాజిక తత్వానికి నాంది పలికింది. అయితే, ఏడు దశాబ్దాల ప్రజాస్వామ్య ప్రయాణం తర్వాత కూడా, ఆధునికత ముసుగులో 'మను–వైదిక బ్రాహ్మణీయ' భావజాలం ఒక అదృశ్య శక్తిలా వ్యవస్థలను శాసిస్తూనే ఉంది. ప్రాచీన చాతుర్వర్ణ వ్యవస్థలో భాగమైన క్షత్రియ, వైశ్య వర్ణాలు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ స్వరూపాన్ని మార్చుకున్నాయి. కానీ, ఆ వ్యవస్థలో అట్టడుగున ఉంచబడిన శూద్ర సమూహాలు మాత్రం కుల, మత వైరుధ్యాల సుడిగుండంలో చిక్కుకుని, నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో నిలబడ్డాయి. చట్టం సమానత్వాన్ని బోధిస్తున్నా, సామాజిక ఆచరణలో మాత్రం శ్రేణీకృత అసమానత ఇంకా పచ్చిపుండులాగా ఈ దేశాన్ని సలుపుతూనే ఉంది.

ఈ పరిణామ క్రమంలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, దేశ జనాభాలో కేవలం 3 నుండి 5 శాతంగా ఉన్న బ్రాహ్మణీయ వ్యవస్థ, తన పట్టును ఏమాత్రం కోల్పోకుండా మరింత పటిష్టం చేసుకోవడం. విద్య, అధికారం, సంస్కృతి వంటి కీలకమైన 'నాడీమండలాలను' తన గుప్పిట్లో ఉంచుకున్న ఈ వ్యవస్థ, ఆధునిక సౌకర్యాలను అనుభవిస్తూనే సనాతన ధర్మాల పేరుతో ఆధిపత్యాన్ని కాపాడుకుంటోంది. క్షత్రియ, వైశ్య స్థానాలు అనివార్యమైన మార్పులకు గురైనప్పటికీ, 'బ్రాహ్మణ్యం' మాత్రం తన తాత్విక పునాదులను చెక్కుచెదరకుండా కాపాడుకుంటూ భారతీయ సామాజిక మూలాల్లోకి వేళ్లూనుకుంది. ఈ అప్రతిహత ఆధిపత్యం వెనుక ఉన్న రహస్యమేమిటి? ఏ శక్తులు దీనిని కాపాడుతున్నాయి? అనే అంశాలను విమర్శనాత్మక కోణంలో విశ్లేషించడమే ఈ వ్యాస పరంపర ఉద్దేశ్యం. వైదిక వాఙ్మయం ఏ విధంగా ఒక సమూహం యొక్క ఆధిపత్యానికి తాత్విక పునాదిగా మారిందో, అది వర్తమాన కాలంలో సరికొత్త రూపాల్లో ఎలా ప్రతిబింబిస్తుందో ఇక్కడ లోతుగా విశ్లేషిద్దాం.

(ఈ వ్యాసపరంపర రెండు భాగాలుగా రెండు రోజులపాటు వరుసగా ప్రచురితమవుతుంది.)

### పురుష సూక్తం - విభజన సిద్ధాంతం :

ఋగ్వేదంలోని 'పురుష సూక్తం' సమాజాన్ని నాలుగు భాగాలుగా విభజించి, ఆ విభజనను సాక్షాత్తు దైవ నిర్ణయంగా అభివర్ణించింది. విరాట్ పురుషుని ముఖం నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు జన్మించారనే సిద్ధాంతం.. అసమానతను కేవలం సామాజికమైనదిగా కాకుండా 'పవిత్రమైనది'గా చిత్రించింది.

నేటి ఆధునిక కాలంలో రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు ఇచ్చినా, ఈ 'పాదాల నుండి పుట్టిన వారు సేవకే పరిమితం' అనే భావజాలం అదృశ్య రూపంలో కొనసాగుతోంది. నేటికీ మలమూత్రాలను ఎత్తే పారిశుధ్య పనుల్లో లేదా మురికి కాలువలు శుభ్రం చేసే పనుల్లో కేవలం ఒకే సామాజిక వర్గానికి (శూద్ర/అతిశూద్ర) చెందిన వారు ఉండటాన్ని సమాజం 'సహజం'గా చూస్తోంది. దీన్ని ఒక 'వృత్తి'గా కాకుండా వారి 'నియతి'గా భావించేలా చేయడంలో పురుష సూక్త తాత్వికత నేటికీ ప్రభావం చూపుతోంది. ప్రభుత్వాల్లో కీలక నిర్ణయాలు తీసుకునే ఉన్నత స్థాయి పదవుల్లో బహుజనుల సంఖ్య తక్కువగా ఉండటం, వారు కేవలం క్షేత్రస్థాయిలో 'అమలు చేసే' వర్గాలుగానే మిగిలి పోవడం వెనుక ఈ ప్రాచీన విభజన సిద్ధాంతపు నీడలు కనిపిస్తాయి.

### 1. కర్మ సిద్ధాంతం-పునర్జన్మ-మానసిక బానిసత్వం:

"నీవు పడుతున్న కష్టాలకు కారణం వ్యవస్థలో ఉన్న లోపం కాదు, నీ పూర్వజన్మలో నీవు చేసుకున్న పాపమే" అని నమ్మించడమే కర్మ సిద్ధాంతం. ఇది ఒక వ్యక్తిని తన దారిద్ర్యానికి లేదా వెనుకబాటుతనానికి తననే బాధ్యుడిని చేసుకునేలా చేస్తుంది. దీనివల్ల బాధితుడు తనను అణచివేసే వ్యవస్థను ప్రశ్నించే శక్తిని కోల్పోతాడు. విద్యా వ్యవస్థలో వివక్ష: ఉన్నత విద్యా సంస్థల్లో (ఐ.ఐ.టీ, ఏ.ఐ.ఐ.ఎం.ఎస్. వంటివి) బహుజన విద్యార్థులు ఎదుర్కొంటున్న వివక్షను లేదా వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలను గమనిస్తే, సమాజం వారిని 'మెరిట్ లేని వారు'గా ముద్ర వేస్తుంది. "నీకు తెలివితేటలు లేకపోవడం నీ కర్మ" అనే భావనను పరోక్షంగా వారిపై రుద్దడం ద్వారా, ఆ విద్యా ర్థుల్లో ఆత్మన్యూనతను కలిగిస్తున్నారు.

**ఆధ్యాత్మిక వ్యాపారం:** నేటి టీవీ ఛానెళ్లలో వస్తున్న జ్యోతిష్య కార్యక్రమాలు, బాబాల ప్రసంగాలు గమనించండి. వారు సమస్యలకు పరిష్కారంగా "దోష నివారణ పూజలు", "శాంతి ప్రక్రియలు" సూచిస్తారే తప్ప, హేతుబద్ధమైన ఆలోచనను ప్రోత్సహించరు. ఒక పేదవాడు తన పేదరికానికి కారణం తన 'ప్రారబ్ధ కర్మ' అని నమ్మి, ఉన్న కొద్దిపాటి సొమ్మును కూడా ఈ క్రతువులకే ఖర్చు చేస్తున్నాడు. ఇది రాజ్యాంగం ఆశించిన 'శాస్త్రీయ దృక్పథాన్ని' తుంచేసి, మనిషిని నిరంతర మానసిక బానిసత్వంలో ఉంచుతోంది.




ఈ రెండు సిద్ధాంతాలూ (పురుష సూక్తం & కర్మ సిద్ధాంతం) కలిసి బహుజనుల మెదళ్లలో ఒక 'అదృశ్య జైలు'ను నిర్మించాయి. శారీరక సంకెళ్ల కంటే ఈ తాత్విక సంకెళ్లు అత్యంత ప్రమాదకర మైనవి. ఎందుకంటే, శారీరక సంకెళ్లను పటాపంచలు చేయవచ్చు, కానీ మనిషి తన బానిసత్వాన్ని 'దైవ ప్రసాదం'గా భావించినప్పుడు, విముక్తి మార్గం మూసుకుపోతుంది. బహుజనులు నేడు సోదాహరణంగా అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే.. ప్రాచీన వాఙ్మయాలు కేవలం 'భక్తి'ని మాత్రమే కాదు, ఒక వర్గం యొక్క 'శాశ్వత ఆధిపత్యాన్ని' కూడా బోధించాయి.

### 2. 'శూద్ర' స్థితి - విభజించి పాలించు:

బ్రాహ్మణీయ వ్యవస్థకు ఉన్న అతిపెద్ద భయం 'బహుజన ఐక్యత'. జనాభాలో 85 శాతానికి పైగా ఉన్న శూద్రులు, అతిశూద్రులు అందరూ కలిసి ఒకే తాటిపైకి వస్తే తమ ఆధిపత్యం పేకమేడలా కూలిపోతుందని ఆ వ్యవస్థకు తెలుసు. అందుకే, వారిని ఒక 'సమూహం'గా కాకుండా, వేల సంఖ్యలో 'ముక్కలు'గా విడగొట్టారు.

#### అ) క్రమానుగత శ్రేణి – ఆత్మగౌరవానికి అడ్డుకట్ట

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్లేషించినట్లుగా, భారతదేశంలో ఉన్నది కేవలం అసమానత కాదు, అది 'శ్రేణీకృత అసమానత'. అంటే ఒక నిలువు వరుసలో కులాలను అమర్చడం. దీనివల్ల ప్రతి కులానికి తనకంటే పైన ఒక కులం ఉంటుంది (అణచివేతకు గురవ డానికి), అలాగే తనకంటే కింద ఒక కులం ఉంటుంది (అణచివేసి ఆనందించడానికి).

ఈ వ్యవస్థ వల్ల అట్టడుగున ఉన్న కులాలు తమను అణచివేస్తున్న పైవాడిపై తిరగబడవు. ఎందుకంటే, తమకంటే తక్కువగా చూసేందుకు కింద మరో కులం ఉందనే 'అహంకారం' వారిని ఆ వ్యవస్థలో భాగస్వాములను చేస్తుంది. ఇది ఒక అద్భుతమైన 'సాంస్కృతిక కుట్ర'.

**కుల సంఘాల కుమ్ములాటలు:** నేడు మనం చూస్తున్న సామాజిక వర్గాల పోరాటాలు అగ్రవర్ణాలపై ఉండవు. ఒక బీసీ కులం మరో బీసీ కులంతోనో, లేదా ఎస్సీ వర్గాలతోనో పోటీ పడుతుం టుంది. "మేము వారికంటే గొప్పవాళ్లం, మాకు ప్రత్యేక గుర్తింపు కావాలి" అని కోరుకోవడమే తప్ప, "మనందరినీ బానిసలుగా ఉంచిన వ్యవస్థను కూల్చుదాం" అనే ఆలోచన రాకుండా ఈ శ్రేణీకృత అసమానత అడ్డుపడుతోంది.

సోషల్ మీడియా గ్రూపులు: నేటి డిజిటల్ యుగంలో కూడా కులాల వారీగా వాట్సాప్ గ్రూపులు, ఫేస్బుక్ పేజీలు పెరిగిపోవడం.. తమ కుల మూలాలను గొప్పగా చెప్పుకుంటూ పక్క కులాన్ని కించపరచడం వెనుక ఈ 'గ్రేడెడ్ ఇన్‌క్వాలిటీ' మానసిక స్థితి స్పష్టంగా కనిపిస్తోంది.

#### ఆ) కుల వృత్తులు – ఆర్థిక నిర్బంధం:

మనుధర్మం వృత్తిని కులంతో ముడిపెట్టింది. ఒక వ్యక్తి తన తెలివితేటలతో సంబంధం లేకుండా, పుట్టిన కులాన్ని బట్టే వృత్తిని చేపట్టాలని శాసించింది. దీనివల్ల 'సామాజిక గమనం' పూర్తిగా నిలిచిపోయింది. అంటే, ఒక శూద్రుడు ఎంత మేధావి అయినా తను తండ్రి చేసిన వృత్తినే చేయాలి తప్ప, సమాజంలో ఉన్నత స్థానానికి వెళ్లకూడదు. ఇది కేవలం సామాజిక వివక్షే కాదు, అదొక 'ఆర్థిక నిర్బంధం'. వృత్తిని గౌరవించడం పేరుతో ఒక సమూహాన్ని తరతరాలుగా ఒకే పనికి పరిమితం చేయడం వల్ల, వారు ఆర్థికంగా ఎదగలేకపోయారు. సంపద, అధికారం కేవలం అగ్రవర్ణాల చేతుల్లోనే కేంద్రీకృతమయ్యాయి.

**కుల వృత్తుల ప్రోత్సాహక పథకాలు:** ఆధునిక ప్రభుత్వాలు కూడా 'కుల వృత్తుల పునరుద్ధరణ' పేరుతో ఇచ్చే పథకాలను గమనించండి. ఒక రజకుడికి ఇస్త్రీ పెట్టె, ఒక నాయీబ్రాహ్మణుడికి సెలూన్ షాపు కిట్ ఇవ్వడం, మత్స్యకారులకు ఉచిత చేప పిల్లలను పంపిణీ చేయడం, యాదవులకు మేకలను, గొర్రె లను పంపిణీ చేయడం, కల్లుగీత పనివారికి మరోరూపంలో రాయితీలు ఇవ్వడం ద్వారా వారిని మళ్లీ అదే వృత్తిలో ఉంచాలని చూస్తున్నారు తప్ప, వారి పిల్లలు శాస్త్రవేత్తలు కావాలనో, పారిశ్రామికవేత్తలు కావాలనో ప్రోత్సహించడం లేదు. ఇది పరోక్షంగా శూద్రులను మళ్లీ పాత వ్యవస్థకే కట్టిపడేసే ప్రయత్నం.

**కార్పొరేట్ రంగంలో ఆధిపత్యం:** నేడు ఐటీ లేదా కార్పొరేట్ రంగాల్లో చూస్తే, కీలకమైన మేనేజ్మెంట్ పదవుల్లో అగ్రవర్ణాల వారే ఉంటారు. శూద్రులు/బహుజనులు ఎంత కష్టపడినా 'నెట్వర్కింగ్' లేకపోవడం వల్ల లేదా 'సామాజిక మూలధనం' లేకపోవడం వల్ల వెనుకబడిపోతున్నారు. కుల వృత్తుల నుండి బయటపడినా, ఆధునిక ఆర్థిక వ్యవస్థలో కూడా ఒక రకమైన 'అదృశ్య గాజు గోడ' వారిని ఉన్నత స్థానాలకు వెళ్లకుండా అడ్డుకుంటోంది.

శూద్రులను కులాలుగా విడగొట్టడం అంటే.. ఒక పెద్ద సైన్యాన్ని విడివిడి వ్యక్తులుగా మార్చి నిర్వీర్యం చేయడం. ఈ 'విభజించి పాలించు' సూత్రం వల్లే 85 శాతం ఉన్న జనాభా, 3–5 శాతం ఉన్న వర్గం ముందు మోకరిల్లుతోంది. బహుజనులు తమ స్వీయ గుర్తింపును లేదా ఆత్మగౌరవాన్ని పొందాలంటే, ముందుగా ఈ 'శ్రేణీకృత అసమానత'ను గుర్తించి, తమ మధ్య ఉన్న చిన్న చిన్న భేదాలను పక్కన పెట్టి ఒక సామాజిక శక్తిగా ఎదగాలి.

### 3. సంస్కృతి, ఆచారాల ద్వారా 'అదృశ్య నియంత్రణ'

బ్రాహ్మణీయ వ్యవస్థ తనను తాను కాపాడుకోవడానికి ఎంచుకున్న అత్యంత శక్తివంతమైన మార్గం 'సాంస్కృతిక విలీనం'. బహుజనుల సొంత ఆచారాలను రద్దు చేయకుండానే, వాటికి వైదిక రంగు పూయడం ద్వారా వారిని మానసికంగా లొంగదీసుకోవడం దీని ప్రధాన ఉద్దేశ్యం.

#### అ) సాంస్కృతిక సమ్మతి – బానిసత్వానికి దైవత్వ ముద్ర:

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు శూద్రులు/బహుజనులు ప్రకృతిని, తమ పూర్వీకులను పూజించేవారు. అందులో పూజారులు ఉండేవారు కాదు, మంత్రాలు ఉండేవి కావు. కానీ నేడు, గ్రామ దేవతలకు ఆలయాలు నిర్మించి, అందులో ధ్వజస్తంభాలు నాటి, బ్రాహ్మణ పురోహితులను నియమించడాన్ని ఒక 'సామాజిక హోదా'గా మార్చేశారు.

**దైవభీతి–ముహూర్తాల ఉచ్చు:** ఇంటి నిర్మాణం నుండి పిల్లల నామకరణం వరకు, చివరికి భూమి పూజ వరకు పురోహితుడు లేనిదే అడుగు ముందుకు పడని స్థితిని కల్పించారు. "ముహూర్తం బాలేకపోతే అనర్థం జరుగుతుంది" అనే భయాన్ని ఆయుధంగా వాడుకుని, సామాన్యుడి ఆలోచనా శక్తిని బందీ చేశారు.

**బహుజన నిధుల మళ్లింపు:** బహుజనులు తమ కష్టార్జితాన్ని ఆలయాల నిర్మాణం కోసం, యజ్ఞ యాగాల కోసం ఖర్చు చేసేలా ప్రేరేపించడం ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి అడ్డుకట్ట వేస్తున్నారు. తమ సొంత దేవతలైన ఎల్లమ్మ, పోశమ్మలకు కూడా బ్రాహ్మణ పురోహితుడే 'యోగ్యతా పత్రం' ఇవ్వాలనే స్థితికి బహుజన సమాజాన్ని తీసుకురావడం ఈ సాంస్కృతిక ఆధిపత్య విజయమే.

#### ఆ) వీరుల చరిత్రను వక్రీకరించడం:

చారిత్రక వీరులను లేదా సామాజిక పోరాట యోధులను తమ వ్యవస్థకు అనుకూలంగా మార్చుకోవడం లేదా వారిని రాక్షసు లుగా చిత్రించి చంపేయడం బ్రాహ్మణీయ పురాణాల ప్రత్యేకత.

**ఏకలవ్యుని వృత్తాంతం:** ఏకలవ్యుడిని ఒక గొప్ప వీరుడిగా కాకుండా, ద్రోణాచార్యుడికి తన బొటనవేలును గురుదక్షిణగా ఇచ్చిన 'ఆదర్శ బానిస'గా పురాణాలు చిత్రించాయి. అంటే, శూద్రుడు విద్య నేర్చుకున్నా, అది అగ్రవర్ణాల ప్రయోజనాలకు భంగం కలగకుండా ఉండాలనే హెచ్చరిక ఇందులో ఉంది. నేటికీ విద్యా వ్యవస్థలో బహుజన విద్యార్థుల ప్రతిభను తొక్కేయడానికి ఈ భావజాలం ప్రేరణగా పనిచేస్తోంది.

**శంభూక వధ:** తపస్సు చేసినందుకు శంభూకుడనే శూద్రుడిని చంపేయడం ద్వారా.. "జ్ఞానం, ఆధ్యాత్మికత కేవలం మా వర్గానికే సొంతం" అనే నియంతృత్వాన్ని చాటారు.

**బహుజన దేవతల వైదీకరణ:** తెలంగాణలోని సమ్మక్క–సారలమ్మ జాతరలో ఒకప్పుడు ఆదివాసీ ఆచారాలే ఉండేవారు. కానీ మెల్లగా అక్కడ కూడా వైదిక క్రతువులను జొప్పించడం ద్వారా, ఆ వీరవనితల పోరాట పటిమను మరుగున పడేసి, వారిని కేవలం పూజామూర్తులుగా మార్చివేశారు. అణచివేతపై పోరాడాల్సిన స్ఫూర్తిని ఇచ్చే దేవతలను, కేవలం "కోరికలు తీర్చే" దైవాలుగా కుదించివేయడం పెద్ద కుట్ర.

ఈ 'అదృశ్య నియంత్రణ' వల్ల బహుజన సమాజం తన 'సాంస్కృతిక స్వయంప్రతిపత్తిని' కోల్పోయింది. ఒక దళిత లేదా వెనుకబడిన వర్గానికి చెందిన వ్యక్తి కోట్లు సంపాదించినా, ఉన్నత పదవిలో ఉన్నా.. ఒక పురోహితుడి కాళ్ల మీద పడటమే సంస్కారం అని భావించేలా ఈ వ్యవస్థ వారి మెదళ్లను ప్రోగ్రామ్ చేసింది.

తమ పూర్వీకులైన వీరుల చరిత్రను మర్చిపోయి, తమను అణచివేసిన శక్తులను పూజించే స్థితిలోకి నెట్టబడటమే నేటి బహుజనుల అతిపెద్ద విషాదం. దీని నుండి బయటపడాలంటే, మన దేవతలను మనం మన పద్ధతుల్లోనే పూజించుకోవాలి, మన చరిత్రను మనమే రాసుకోవాలి.

(రెండవ/ముగింపు భాగం రేపటి సంచికలో ...)

# కోల్ మైన్స్ పెన్షన్ స్కీం -
# కార్మికుల భవిష్యత్తుకు భరోసానా ? భారమా ?



ఆళవందార్‌వేణు మాధవ్

భారతదేశంలో బొగ్గు గనుల పరిశ్రమ దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా నిలుస్తోంది. ఈ రంగంలో లక్షలాది మంది కార్మికులు తమ జీవితాన్ని అర్పించి దేశానికి విద్యుత్, పారిశ్రామి క శక్తిని అందించారు. అయితే, వారు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత వారి జీవన భద్రత ఎంతమేరకు ఉందనే ప్రశ్నకు సరైన సమాధానం ఇప్పటికీ లభించలేదు. ఈ నేపథ్యంలో కోల్ మైన్స్ పెన్షన్ స్కీం–1998పై సమగ్ర పరిశీలన అవసరం ఎంతైనా ఉంది. బొగ్గు గనుల కార్మికుల సంక్షేమం కోసం మొదటగా 1948లో కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ అమలులోకి వచ్చింది. ఇది ఉద్యోగ కాలంలో సేవింగ్స్ మాత్రమే అందించింది. 1971లో ఫ్యామిలీ పెన్షన్ స్కీం ప్రవేశపెట్టబడినా అది కేవలం మరణించిన కార్మికుల కుటుంబాలకు మాత్రమే పరిమితమైంది. 1975లో కోల్ ఇండియా స్థాపించబడి నప్పటికీ, 1998 వరకు పూర్తి స్థాయి వృద్ధాప్య పెన్షన్ వ్యవస్థ అందు బాటులో లేదు. ఇదే పరిస్థితి సింగరేణి సంస్థలో కూడా కొనసాగింది. కార్మికుల నిరంతర డిమాండ్ల ఫలితంగా 1998లో కోల్ మైన్స్ పెన్షన్ స్కీం ప్రవేశపెట్టబడింది. ఈ స్కీం ద్వారా ఉద్యోగులకు నెలవారీ పెన్షన్ అందించే వ్యవస్థ ఏర్పడింది. ఇది కార్మికుల భవిష్యత్తుకు ఒక ఆశా కిరణంగా నిలిచింది. ఈ స్కీం కోసం ప్రత్యేకంగా కొత్త నిధి సృష్టించ కుండా, పాత ఫ్యామిలీ పెన్షన్ స్కీం నిధులు, ఉద్యోగి మరియు యాజమాన్యం కాంట్రిబ్యూషన్లు, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఒక సమిష్టి నిధి ఏర్పాటు చేయబడింది. అయితే, కాంట్రిబ్యూషన్ శాతం చాలా తక్కువగా ఉండటం ఈ స్కీం బలహీనతకు ప్రధాన కారణంగా మారింది. ఉద్యోగి మరియు యాజమాన్యం వాటా కలిపి సుమారు 2.33 శాతం మాత్రమే ఉండగా, కేంద్ర ప్రభుత్వం 1.16 శాతం మాత్రమే అందిస్తోంది. ప్రస్తుతం కోల్ ఇండియా మరియు సింగరేణి సంస్థలలో లక్షలాది మంది పెన్షనర్లు చాలా తక్కువ మొత్తంతో జీవిస్తున్నారు. పెన్షన్ రూ.1000 నుండి రూ.3000 మధ్య ఉండటం, ద్రవ్యోల్బణం పెరగడం, వైద్య ఖర్చులు అధికం కావడం వంటి కారణాలతో వారు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. పెన్షన్‌లో డియర్‌నెస్ అలవెన్స్ లేకపోవడం, పెన్షన్ పెంపు లేకపోవడం, చెల్లింపుల్లో ఆలస్యం వంటి సమస్యలు మరింత కష్టాలను కలిగిస్తున్నాయి. ప్రస్తుతం పెన్షన్ ఫండ్ వేల కోట్లలో ఉన్నప్పటికీ, భవిష్యత్తు బాధ్యతలను తీరించడానికి సరిపడడం లేదు. నిధి కంటే బాధ్యతలు ఎక్కువగా ఉండటం వల్ల ఈ స్కీం భవిష్యత్తులో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది ఉద్యోగి, యాజమాన్యం కలిపి 14% కాంట్రిబ్యూషన్ ఉన్నప్పటికీ, గతంలో తక్కువ నిధుల కారణంగా లోటు పెరిగింది. ?20 లెవి కూడా ప్రస్తుత పరిస్థితుల్లో సరిపోదు. ఈ విధంగా కొనసాగితే భవిష్యత్తులో పెన్షన్ వ్యవస్థ ప్రమాదంలో పడే అవకాశం ఉంది. బొగ్గు లెవిని రూ.20 నుండి కనీసం రూ.100కు పెంచాలి. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధి ఇవ్వాలి. కనీస పెన్షన్ రూ.10,000 ,డిఏ అమలు చేయాలి. ఫండ్ బలోపేతానికి ప్రత్యేక ప్యాకేజీ అవసరం. ప్రస్తుతం కోల్ మైన్స్ పెన్షన్ ఫండ్ తాజా కేంద్ర ప్రభుత్వ వార్షిక నివేదిక (2025–26) ప్రకారం: ఉద్యోగుల నుంచి వచ్చే పెన్షన్ కాంట్రిబ్యూషన్ సంవత్సరానికి సుమారు రూ.5,600 కోట్లు ఉండగా, పెన్షన్ చెల్లింపులు సుమారుగా రూ.6,400–రూ.6,500 కోట్లు ఉంటుందని అంచనా. అంటే ప్రతి సంవత్సరం వచ్చే డబ్బు కంటే వెళ్లే డబ్బు ఎక్కువగా ఉంది. ప్రతి సంవత్సరం పెన్షన్ చెల్లింపులు నిరంతరం పెరుగుతున్నాయి రిటైర్డ్ ఉద్యోగుల సంఖ్య పెరగడం వల్ల ఖర్చు కూడా పెరుగుతోంది గతంలో కూడా ఖర్చు ఆదాయాన్ని మించిందని ప్రభుత్వం చెప్పింది చిన్న స్థాయి వార్షిక లోటు ఒక అంచనా ప్రకారం, ఆదాయం రూ.1,200 కోట్లు కాగా, ఖర్చు రూ.1,440 కోట్లు, వార్షిక లోటు రూ.240 కోట్లుగా ఉంది. కొన్ని అధ్యయనాల ప్రకారం మొత్తం దీర్ఘకాలంలో మొత్తం పెన్షన్ ఫండ్ లోటు రూ.26,000 కోట్లుగా తేలింది. ఇది చాలా ముఖ్యమైన సంఖ్య–భవిష్యత్తులో అందరికీ పెన్షన్ ఇవ్వడానికి అవసరమైన డబ్బు అంత లేదు అని అర్థం. బొగ్గు గనుల కార్మికులు దేశాన్ని వెలిగించారు. వారి వృద్ధాప్యం చీకటిలో మిగలడం అన్యాయం. కోల్ మైన్స్ పెన్షన్ ఫండ్‌ను బలోపేతం చేయడం అత్యవసరం. "కార్మికుడి చెమటతో దేశం వెలిగితే, వారి వృద్ధాప్యం కూడా గౌరవంగా ఉండాలి కనీస పెన్షన్‌నురూ.10,000కు పెంచా లి, డియర్‌నెస్ అలవెన్స్ అమలు చేయాలి, కాంట్రిబ్యూషన్ శాతం పెంచాలి, కేంద్ర ప్రభుత్వ వాటా పెంచాలి. కోల్ మైన్స్ కార్మికులు దేశానికి చేసిన సేవ అపారమైనది. వారి వృద్ధాప్యంలో కనీస భద్రత కూడా లేకపోవడం ఒక సామాజిక అన్యాయం. కోల్ మైన్స్ పెన్షన్ స్కీంను బలోపేతం చేయడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా సమాజానికి ఉన్న నైతిక కర్తవ్యమూ కూడా. "దేశాన్ని వెలిగించిన కార్మికుల జీవితాలు చీకటిలో మిగలకూడదు."

**వ్యాసకర్త: సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి.**



## అవుట్‌సోర్సింగ్ కార్మికుడి కుటుంబానికి 30లక్షల పరిహారం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 07 : సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన అవుట్‌సోర్సింగ్ కార్మికుడు టాగూర్ సునీల్ కుటుంబానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా రూ.30 లక్షల పరిహారం అందజేశారు. మంగళ వారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ సహాయాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీఆర్) రూపంలో కుటుంబ సభ్యులకు అందించారు. సింగరేణి ఆర్జీ–1లో స్కావెంజర్ గా పనిచేస్తూ అకాల మరణం చెందిన సునీల్ కుటుంబానికి రూ.30 లక్షల నష్ట పరిహారం అందించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు మృతుని తల్లి టాగూర్ కళావతికి రూ.7.50 లక్షలు, కుమార్తె దీక్షితకు రూ.11.25 లక్షలు, కుమారుడు అంకిత్‌కు రూ.11.25 లక్షల చొప్పున ఎఫ్‌డీఆర్ పత్రాలను కలెక్టర్ అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అధికారులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ–1 జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పివో శ్రావణ్ కుమార్, రెవెన్యూ శాఖ అధికారి కుమారస్వామి, మృతుని భార్య సంజు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

### కూకట్‌పల్లి ఇన్చార్జి బండి రమేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 7 : టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల గురించి సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ సృజనను కలిసి, నిరుపేదలు నివసిస్తున్న బస్తీలతోపాటు, మధ్యతరగతి ప్రజల ఆవాసాల్లోను కొన్ని ప్రాంతాల్లో రహదారులు డ్రైనేజీ తాగునీటి వ్యవస్థలు సరిగాలేవని ఆయా ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేయాలని కమిషనర్ను కోరారు. వీటితోపాటు బస్తిలో ఉన్న ఖాళీ స్థలాల్లో కమ్యూనిటీ హాల్స్ ను నిర్మించి స్థానిక ప్రజలకు మహిళా సంఘాలకు అందజేయాలని సూచించారు. గతంలో ప్రారంభమై కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని, ప్రారంభం కావాల్సి ఉన్న పనులను ప్రారంభించాలని రమేష్ సృజనకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలి బాలాజీ, లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

**- నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సేకరించాలి - కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుపై ఏపీఎంలు, ఐకేపీ**
**- కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, బుక్ కీపర్లకు ఐడీఓసీలో శిక్షణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 07 : రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుపై ఏపీఎంలు, ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, బుక్ కీపర్లకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం శిక్షణ ఇవ్వగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. గ్రేడ్ ఏ రకం వరి ధాన్యం క్వింటాలుకు రూ.2,389, కామన్ రకానికి క్వింటాలుకు రూ.2,369 గా ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని వివరించారు. ఐకేపీ ఆద్వర్యంలో జిల్లాలో ఏర్పాటు చేయనున్న 136 కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు వేయించాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. తూకం వేసే యంత్రాలు, తేమ శాతం చూపే యంత్రాలు, టార్పాలిన్లు, గన్ని బ్యాగ్స్ సరిపడా సమకూర్చుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు ఇతర వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. సంబంధిత ఏఈఓ ధృవీకరించిన తరువాత కొనుగోలు చేయాలని, కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల వద్ద రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎల్ బుచ్చిబాబు, పౌర సరఫరాల శాఖ డీఎం నర్సింహారెడ్డి, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు వసతులు సద్వినియోగం చేసుకోవాలి

**- టైమ్ టేబుల్ ప్రకారం చదవాలి**
**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- వేములవాడలోని మహాత్మాజ్యోతి బాపూలే**
**- బాలికల రెసిడెన్షియల్ విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వేములవాడ, ఏప్రిల్ 07 : ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వేములవాడ పట్టణంలోని మహాత్మాజ్యోతి బాపూలే బాలికల రెసిడెన్షియల్ విద్యాలయంలో కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయం ఆవరణ, తరగతి గదులు, కిచెన్ లో ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ చార్ట్ పరిశీలించి.. ఏ ఏ వంటకాలు సిద్ధం చేస్తున్నారో తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తమ కుటుంబంలో పిల్లలకు ఆహార పదార్థాలు ఎలా సిద్ధం చేస్తారో అలాగే ఇక్కడ విద్యార్థుల కోసం వండాలని ఆదేశించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులతో కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. అన్ని పరీక్షలకు సంబంధించిన టైమ్ టేబుల్ సిద్ధం చేసుకోవాలని, ఏ రోజు ఏ సబ్జెక్ట్ చదవాలో ముందే రాసుకోవాలని, దానికి అనుగుణంగా అన్ని సబ్జెక్టులు చదవడం, రాయడం పూర్తి చేయాలని తెలిపారు. రైటింగ్ కూడా సాధన చేయాలని, వార్షిక పరీక్షల సమయానికి అనుగుణంగా ఇప్పుడు అదే సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సాధన చేయాలని పేర్కొన్నారు. ఇప్పటి మార్కులు మీరు తర్వాత చదివే ఉన్నత తరగతులకు ఎంతో కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థులం దరూ రానున్న పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఏ నేపథ్యం నుంచి వచ్చినా.. ఇప్పుడు ఇష్టపడి సాధన చేయడం.. అన్ని సబ్జెక్టుల్లో రాణించడంతో వారి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడాలని, ఉన్నత స్థానాల్లో నిలవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

## పారదర్శకంగా రాజన్న కోడెల పంపిణీ

**- పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం - ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
**- హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్ - వేములవాడ పట్టణం తిప్పాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి**
**- గోశాలలో రైతులకు ఉచితంగా కోడెల పంపిణీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




వేములవాడ, ఏప్రిల్ 07 : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాల కోడెలను అర్హులైన రైతులకు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని, కోడెలను సంరక్షించి.. సాగు పనులకు వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. వేములవాడ పట్టణం తిప్పాపూర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో రైతులకు మంగళవారం కోడెల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరై రైతులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందజేశారు. ప్రభుత్వ విప్, కలెక్టర్ కు శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఇంచార్జి ఈఓ అంజనారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారి పత్రాలను అధికారులు తనిఖీ చేస్తుండగా, ప్రభుత్వ విప్, కలెక్టర్ పరిశీలించి.. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగాహౌశ్రీ రాజరాజేశ్వర స్వామివారికి కోడెను కట్టే సంస్కృతి వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధిలో ఉందని గుర్తు చేశారు. భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు అని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు తిప్పాపూర్ గోశాలలోహౌ ఉచితంగా స్వామివారి కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పంపిణీ చేసిన కోడెలను తనిఖీ చేయిస్తామని స్పష్టం చేశారు. కోడెలను పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వేములవాడ పరిధిలో అధునాతన సౌకర్యాలతో సువిశాల స్థలంలో గోశాల నిర్మాణానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రూ.150 కోట్లతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. కోడెలను రైతులు సంరక్షించాలని సూచించారు.

కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆన్లైన్ లో అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకున్న రైతులకు కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతులు ఆన్లైన్ లో దరఖాస్తులను వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీ చేసిన తర్వాత రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, పరిసర జిల్లాలకు చెందిన 1.5 నుంచి 5 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న సన్నకారు, చిన్నకారు అర్హులైన రైతులకు మాత్రమే పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. అర్హులైన రైతులకు కోడెల పంపిణీ నిరంతరం చేస్తామని తెలిపారు. కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు. వాటిని ఎల్లప్పుడూ అధికారులతో తనిఖీ చేయిస్తామని స్పష్టం చేశారు. గోశాలలో కోడెల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటు న్నామని, గడ్డి, నీరు, అందిస్తున్నామని, దాదాపు 8 కూలర్లు ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. అలాగే జిల్లా పశు వైద్యాధికారి, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, ఆర్డీఓ రాధాభాయ్, ఆలయ ఇంచార్జి ఈఓ అంజనారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్, వ్యవసాయ, రెవెన్యూ, ఆలయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ హోమియోపతి దినోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 07 : ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం సందర్భంగా ఈ నెల 10 వ తేదీన నిర్వహించబోయే కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఆవిష్కరించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 10 వ తేదీన ఉదయం 6.30 నుండి 7.30 గంటల వరకు యోగా అవగాహన శిబిరం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించడం జరుగుతుందని, అనంతరం అంబేద్కర్ నగర్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9.30 నుండి ఆయుష్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ విభాగం జిల్లా ఇంచార్జి మెడికల్ ఆఫీసర్ డా.శశిప్రభ, మెడికల్ ఆఫీసర్ డా.కృష్ణవేణి, యోగా ట్రైనర్లు శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నేతలకు పద్మశాలి సంఘం సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 7 : అంతర్గాం మండల కేంద్రంలో మంగళవారం పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పూదరి సత్తయ్య గౌడ్ రెండు మండలాల కోఆర్డినేటర్ గాదె సుధాకర్లను పట్టు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ గంగాధరి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ బరపటి తిరుపతి, బీసీ సెల్ అధ్యక్షులు బరుపటి శ్రీనివాస్, పద్మశాలి సంఘం గౌరవఅధ్యక్షులుఎలిగేటి లింగయ్య తదితరులు పాల్గొన్నారు



## ఉపాధి హామీ కూలీలకు టోపీలు గ్లూకోజ్ పంపిణి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 7 : అంతర్గాం మండలం మద్దిరాల గ్రామ శివారులో భగభగ మండే ఎండలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీల వద్దకు మంగళవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ వెళ్లి అందరిని ఆప్యాయతతో పలకరించి వారి శ్రమకు సంబంధించిన విషయా లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎండ వేడిమిలో పనిచే స్తున్న ఉపాధి హామీ కూలీలందరికీ ఎండను తగలకుండా కాపాడు కునేందుకు టోపీలను, నీరసం దరిచేరకుండా ఉండేందుకు గ్లూకోజ్ పాకెట్లను అందించారు. రామగుండం నియోజకవర్గంలోని అందరి ఆరోగ్యం క్షేమం అభివృద్ధి రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ లక్ష్యమని ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా మనాలిఠాకూర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగులో ఈశాల తక్కల్లపల్లి ముందంజ

### ఇతర గ్రామాలకు ఆదర్శం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, ఏప్రిల్ 7 : పాలకుర్తి మండలంలో ఈశాల తక్కళ్లపల్లి రైతులు ఆయిల్ ఫామ్ సాగులో ముందంజలో ఉన్నారని ఇతర గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలిచారని పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ అన్నారు. మంగళ వారం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. ఒక ఎకరం వరి సాగు చేసే నీటితో మూడు నాలుగు ఎకరాల ఆయిల్ ఫామ్ సాగును చేపట్టవచ్చని, దీనికి ప్రభుత్వం గరిష్ట రైతు కూడా అందిస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సదస్సుకు హాజరైన రామగుండం ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి కోరారు. ఈ అవగాహన సదస్సులో జయ్యారం విస్తరణ వ్యవసాయ అధికారి ఎంయోజన, సర్పంచ్ బండి శ్రీనివాస్, ఉప సర్పంచ్ తిరుమల, ఆయిల్ ఫామ్ ఫీల్డ్ అసిస్టెంట్ టి.ప్రశాంత్ హెచ్.రాముతో పాటు రైతులు పాల్గొన్నారు.

## గ్రామ భద్రతకు 'నిఘా నేత్రం'

### బొమ్మపూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 7 : నేర నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతం గా వినియోగిన్తూ, ప్రజల భాగస్వామ్యంతో గ్రామ భద్రతను బలోపేతం చేయడానికి పోలీసులు "నిఘా నేత్రం" మరియు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ఆదేశాల మేరకు భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం బొమ్మపూర్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో, గ్రామ ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాల వ్యవస్థను కాటారం డీఎస్పీ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలు-పోలీసుల మధ్య సమన్వయం మరింత బలపడుతుందని తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నివారణతో పాటు విచారణ ప్రక్రియ కూడా వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు పోలీస్ శాఖకు అందించిన సహకారం అభినందనీ యమని ఆయన కొనియాడారు. భద్రతను ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి, ఇలాంటి కార్యక్రమాలలో ప్రజలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## మన ఇసుక వాహనం పథకంపై అవగాహన కార్యక్రమం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 07: కలెక్టరేట్ టీజీ స్వాన్ వీడియో కాన్ఫ రెన్స్ సమావేశం మందిరం లో జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా మైనింగ్ అధికారి, మండలాల తహసీల్దారులకు, పంచాయతీ సెక్రటరీలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఇసుక వాహనం ఆన్లైన్ ద్వారా ఇసుక కేటాయింపులు, తదితర అంశాలపై మంగళవారం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా టెక్నికల్ అసిస్టెం ట్ నరేష్ శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్,హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇక పై పూర్తి స్థాయిలో ఇసుక సరఫరా కోసం ఆన్లైన్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని, అందుకు మన ఇసుక వాహనం పథకంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సమావేశం లో ఏడి మైనింగ్ వెంకటరమణ, డిపిఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

## పక్కగా ముఖ నిర్ధారణ పక్రియ

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 07 : జిల్లాలో ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న వారిని పక్కాగా ఫేషియల్ (ముఖ)నిర్ధారణ ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ పట్టణం ఫేషియల్ (ముఖ) నిర్ధారణ ప్రక్రియలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందని,ఈ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న వారి నుండి ఫేషియల్ నిర్ధారణ ప్రక్రియను యాప్ ద్వారా చేస్తామన్నారు. ఈ ప్రక్రియ ఈరోజు,రేపు మెదక్ పట్టణంలోని 7, 20, 21 ,22 వార్డుల్లో కొన సాగుతుందన్నారు. వార్డ్ ఆఫీసర్లు,మెప్మా సిబ్బంది నాలుగు బృందాలుగా ప్రక్రియలు చేప డుతుందన్నారు.నిర్ధారణ ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. మరణించిన వారిని పెన్షన్ పథకం నుండి తొలగించడానికి, పెన్షన్ పొందుతున్న వారిని నిర్ధారించడానికి ఈ కార్యక్రమాన్ని చేపడు తున్నట్లు వివరించారు.ఈకార్యక్రమంలో డిఆర్డిఏ శ్రీనివాసరావు,సర్ఫ్ డైరెక్టర్ సోషల్ సెక్యూరిటీ గోపాల్,ప్రాజెక్టు మేనేజర్ గోవర్ధన్ టి.జి ఆన్లైన్, కృష్ణంరాజు,మృనాల్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహా భాగ్యం

### కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే అంజిరెడ్డి..

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, ఏప్రిల్ 07 : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ 5కే రన్ కార్యక్రమం మెడికల్ కాలేజీ నుండి ఐబి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య వీశ్రీఎ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించినట్లుగా, సమతుల్య ఆహారం, వ్యాయామం, పరిశుభ్రత, మానసిక ప్రశాంతత ఆరోగ్యానికి ప్రధాన అంశాలు. ప్రతి వ్యక్తి శాస్త్రీయ దృక్పథంతో రోజువారీ జీవితంలో ఒత్తిడి, చిరాకు వంటి సమస్యలను తగ్గించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. యువత ఆరోగ్య పరంగా




ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్ రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు, డీఎస్పీ సత్తయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, మెడికల్ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## స్తంభాద్రి ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 7:విశ్రాంత పోలీసు అధికారులకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం ఖమ్మం నెహ్రూ నగర్ లోని స్తంభాద్రి ఆసుపత్రిలో పోలీసు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఉద్దేశించి ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పేర్ల హర్ష తేజ మాట్లాడుతూ... గుండె జబ్బులు ఉన్నవారు ఎండాకాలంలో జాగ్రత్తగా ఉండాలని, దాహం వేయకపోయినా తరచుగా నీరు, కొబ్బరినీరు, మజ్జిగ, నిమ్మరసం లాంటివి తాగాలని, శరీరాన్ని హైడ్రేటుగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎండ తీవ్రత సమయాల్లో బయటకు వెళ్లొద్దని తేలికపాటి సులభంగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలనన్నారు. బయటకు వెళ్లే వారు తేలికపాటి, వదులుగా ఉన్న కాటన్ దుస్తులు ధరించాలని, ఉదయం లేదా సాయంత్రం మాత్రమే వ్యాయామం చేయాలని, ఆల్కహాల్, కాఫీ, టీలకు దూరంగా ఉండాలని అన్నారు. తొలుత సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణలు డాక్టర్ పేర్ల హర్షతేజకు కృతజ్ఞతలు తెలిపి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎస్సై, ఏఎస్ఐలు వి.వెంకటేశ్వరరావు ఎండి.ఇస్మాయిల్, బి.ప్రభాకర్ రావు, ఎం.ఆంథోనీ, కామేశ్వరరావు, రంగాచార్యులు, కృష్ణమూర్తితో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఈవియం గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలి

### అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఏప్రిల్ 07:ఈవియం గోదాంవద్ద నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిశీచాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) లక్ష్మి కిరణ్ పోలీస్ గార్డ్ లను ఆదేశించారు. జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను మంగళవారం అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ పలు రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.ఈవియం గదులు, వివి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివి ప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై



ఆరా తీశారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, ఎంఐఎం పార్టీ ప్రతినిధి బర్కత్ ఆలీ, టిడిపి పార్టీ ప్రతినిధి ఎర్రవెల్లి రవీందర్, సిపిఐయం పార్టీ ప్రతినిధి నరేష్, ఎన్నికల సిబ్బందిలు పాల్గొన్నారు.

## పెబ్బేరు ప్రెస్ క్లబ్‌కు సొంత భవనం కల సాకారం వైపు...

### స్లాబ్ పనులు ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


పెబ్బేరు, ఏప్రిల్ 07 : పెబ్బేరు పట్టణంలో పాత్రికేయుల కలగా నిలిచిన ప్రెస్ క్లబ్ నూతన భవనం నిర్మాణం కీలక దశకు చేరుకుంది. నిర్మాణ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం స్లాబ్ పనులను ఘనంగా ప్రారంభించడం ద్వారా ఈ భవనం నిర్మాణం మరింత వేగం అందుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన పెబ్బేరు ప్రెస్ క్లబ్‌కు గత కొన్ని దశాబ్దాలుగా సొంత భవనం అవసరం తీవ్రంగా అనిపిస్తూనే ఉంది. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ విప్‌గా పనిచేసిన రావుల చంద్రశేఖర్ రెడ్డి పాత్రికేయుల సేవలను గుర్తించి భవనం కేటాయించగా, దాదాపు 25 సంవత్సరాలుగా అదే భవనంలో ప్రెస్ క్లబ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అయితే కాలక్రమేణా ఆ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో, భద్రతా సమస్యలు తలెత్తాయి. దీంతో కొత్త భవనం నిర్మాణం అత్యవసరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రెస్ క్లబ్ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించారు. గత పాలకవర్గం కేటాయించిన స్థలంలోనే నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా



స్లాబ్ పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్‌కు సొంత భవనం నిర్మాణం జరగడం పాత్రికేయుల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. భవనం పూర్తయిన తరువాత ఇది కేవలం కార్యాలయంగా మాత్రమే కాకుండా, పాత్రికేయుల అభివృద్ధికి, సమావేశాలకు, శిక్షణా కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్, కౌన్సిలర్లు హరి శంకర్ నాయుడు, తాటికొండ కృష్ణ, శివ సాయి, మన్యం, కాంగ్రెస్ నాయకులు షకీల్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్, కాంట్రాక్టర్ మోతే రాములు, అలాగే పట్టణానికి చెందిన పలువురు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికి ముప్పు- టిడిపి నేత వద్దెం విజయ్

### హైదరాబాద్‌లో మీడియా కార్యాలయంపై దాడి ఖండనీయం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 7 : రాజధాని హైదరాబాద్‌లో మీడియా సంస్థ కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని టిడిపి ఖమ్మం నగర నాయకుడు వద్దెం విజయ్ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఏబీఎన్ మీడియా కార్యాలయంపై జరిగిన దాడి హేయమైన చర్య అని తెలుగుదేశం పార్టీ ఖమ్మం నగర కమిటీ నాయకుడు వద్దెం విజయ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులు చేయడం అసహ్యకరమని పేర్కొన్నారు. గతంలో ఈనాడు సంస్థలపై కూడా ఇలాంటి దాడులు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి అల్లరి చర్యలను వైసీపీ కార్యకర్తలు తక్షణమే మానుకోవాలని హెచ్చరించారు. లేకపోతే ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుందని అన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## మూడవ విడత పిఎంఐఎస్ ప్రారంభం




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 07: భారత ప్రభుత్వం కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం-మూడవ విడత ప్రారంభించబడినది, మహబూ బాబాద్ జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలని, మంగళవారం జనరల్ మేనేజర్ జిల్లా పరిశ్రమల కేంద్రం మహబూబాబాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా 6 లేదా 9 నెలల పాటు ప్రముఖ కంపెనీలలో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. ఎంపికైన వారికి నెలకు రూ.9,000 స్టైపెండ్, రూ. 6,000 గ్రాంట్ ఇవ్వబడుతుంది.18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన, 10వ తరగతి నుండి డిగ్రీ,పీజీ చదివిన లేదా చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 12 లక్షల లోపు ఉండాలి.మరింత సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్: 1800 11 6090 ను సంప్రదించగలరు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఏప్రిల్ 07 : కరీంనగర్ లో పలు 10వ తరగతి పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం తనిఖీ చేశారు. తిరుమల్ నగర్ లోని తెలంగాణ మైనారిటీ బాలికల స్కూల్, కోతి రాంపూర్ లోని (సవరన్) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్ష రాసే విధానాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణ, విద్యా ర్థుల హాజరు అంశాలపై విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పరీక్షలు పకడ్బం దీగా నిర్వహిస్తున్నామని, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

## ఒకే పనస చెట్టుకు 300 కాయలు

### - జీఎం కార్యాలయంలో విశేష ఆకర్షణగా నిలిచిన చెట్టు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 07 : సింగరేణి ఆర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలో ఉన్న పనస చెట్టు ఈ ఏడాది కూడా రికార్డు స్థాయిలో ఫలాలను విరగ కాసింది. ఈ సీజన్‌లో సుమారు 300 పనస కాయలు కాసిన ఈ చెట్టు, మొదలు నుంచి కొమ్మల వరకు కాయలతో నిండిపోయి చూపరులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రకృతి ప్రసాదంగా భావిస్తున్న ఈ చెట్టు కార్యాలయంలో ఒక ప్రత్యేక సంప్రదాయానికి నాంది పలుకు తోందని ఆర్జీ-1 అధికార ప్రతినిధి యం.రవీందర్ రెడ్డి తెలిపారు. ప్రతి సంవత్సరం పండిన పనస కాయలను కార్యాలయంలోని ప్రతి విభాగానికి 3 చొప్పున పంపిణీ చేస్తూ, విభాగాల మధ్య సౌహా ర్దాన్ని పెంపొందిస్తున్నామన్నారు. ఏరియాలోని అన్ని విభాగాల సిబ్బంది ఈ సహజ ఫలాన్ని పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ విశేష దిగుబడికి ఫారెస్ట్రీ విభాగం చేపట్టిన సస్యరక్షణ చర్యలే కారణమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై చూపుతున్న శ్రద్ధ వల్లే ఇటువంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని ఫారెస్ట్రీ విభాగం డిప్యూటీ మేనేజర్ కర్ణ తెలిపారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయ అధికారులు ఫారెస్ట్రీ విభాగాన్ని అభినందించారు.



## కేటీపీఎస్ ఏడవ దశ సీఈ, జేఎస్‌లను కలిసిన బీజేపీ కార్పొరేటర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 7 : భద్రాద్రి జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ ఏడోదశ సీఈ సూర్యనారాయణను, జేఎస్ కనకదుర్గను మంగళ వారం బిజెపి నుంచి 4వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికైన చెరుకు భాగ్యలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. 4వ డివిజన్ అభివృద్ధి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సురేష్, రఘుపతి రాజు ఏసోబు, జానకి ప్రసాద్, కన్నా, రమేష్, చెరుకుడిల్లు సత్యరామ్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## పాల్వంచలో డ్రైనేజీ జామ్

### - తక్షణం మరమ్మతులు చేయించిన కార్పొరేటర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 7 : భద్రాద్రి జిల్లా పాల్వంచ 45వ డివిజన్ ఒడ్డుగూడెంలో డ్రైనేజ్ జామ్ అయి ఇండ్లలో వాడే మురుగునీరు రోడ్డుపై ప్రవహించి, మరలా తిరిగి నివాస గృహాల్లోకి వస్తున్న మురుగునీరుతో ఇబ్బందులు పడుతున్న ప్రజల అభ్యర్థన మేరకు మంగళవారం కార్పోరేటర్ నరేష్ మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్బంగా నరేష్ మాట్లాడుతూ, డివిజన్ లో ఏ సమస్య ఉన్న, స్థానిక డివిజన్ ప్రజలు నా ధృష్టికి తీసుకవస్తే సమస్యలను తక్షణమే ఫరిష్కారానికి క్రృషి చేస్తానని, 24/7 ప్రజలకు అందుబాటులో ఉంటానని యువ కార్పోరేటర్ నరేష్ తెలిపారు.

# ఆరోగ్యం

## ఎండాకాలంలో కూల్ వాటర్ తాగితే చనిపోతారా?



### వైద్యులు ఏం చెప్పారంటే?

మనిషికి నీరు అనేది చాలా ముఖ్యం. అన్నం తినకుండా అయినా మనిషి జీవించగలడేమో కానీ, నీరు తాగకుండా మాత్రం జీవించలేడు. సరైన సమయానికి, సరైన మొత్తంలో నీరు తాగితేనే మనం ఆరోగ్యంగా ఉండగలం. నీరు తాగడంలో ప్రతి వ్యక్తికి ఒక్కో రకమైన విధానం ఉంటుంది. కొంతమంది గోరువెచ్చని నీరు తాగుతారు, మరికొందరు వేడి నీరు తాగడం ఇష్టపడతారు, ఇంకొంతమంది ఐస్ నీరు తీసుకోవడం ఉత్తమంగా భావిస్తారు. అయితే చల్లటి నీరు తాగడం వలన మనిషి చనిపోతాడని పలు కథనాలు వినపడుతున్నాయి. వారు చల్లటి నీరు శరీరానికి హానికరం అని పేర్కొంటున్నారు. ఇంతకీ చల్లటి నీరు తాగడం అనేది నిజంగా హానికరమా? చల్లటి నీరు తాగడం వలన ఎలాంటి సమస్యలు వస్తాయనేది ఇక్కడ తెలుసుకుందాం. చల్లటి నీరు తాగడం వలన ఎలాంటి సమస్యలు వస్తాయి? వైద్యుల ప్రకారం, కొన్ని సందర్భాల్లో చల్లటి నీరు తాగడం వలన కొన్ని సమస్యలు వస్తాయని చెబుతున్నారు. అయితే చల్లటి నీరు తాగడం వల్ల ఒక వ్యక్తి చనిపోవడం అనేది చాలా తక్కువ, అరుదైన సందర్భాల్లో జరుగుతుందని పేర్కొన్నారు. చల్లటి నీరు ఎక్కువగా తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది, ఇది అల్పోష్ణస్థితి మరియు షాక్‌ను కలిగించే అవకాశం ఉంటుంది. అందుకే గుండె జబ్బులతో బాధపడే వ్యక్తులకు చల్లటి నీరు తీసుకోవడం మంచిది కాదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే, చల్లటి నీరు తాగడం వలన కడుపులో అసౌకర్యం, వాంతులు లేదా జీర్ణశయ సంబంధిత సమస్యలు కూడా ఏర్పడతాయని వారు పేర్కొంటున్నారు.

ఇతర వైద్యులు కూడా గది ఉష్ణోగ్రత వద్ద ఉండే నీరు లేదా, కొద్దిగా చల్లటి నీరే తాగాలని సూచిస్తున్నారు. శారీరక శ్రమ చేసిన తరువాత చల్లటి నీరు తాగడం అనేది అత్యంత ప్రమాదకరమని, దానిని కచ్చితంగా మానేయాలని సూచిస్తున్నారు. చల్లటి నీరు తాగిన తర్వాత, మీకు అసౌకర్యం లేదా ఛాతిలో నొప్పి ఉన్నట్లు అనిపిస్తే, వెంటనే వైద్యుడిని సంప్రదించి సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు.

## చికెన్ కందిపప్పు






మీరు ఇప్పటి వరకు ఎన్నో రకాల పప్పులు తిని ఉంటారు. అలాగే ఎన్నో రకాల చికెన్ వంటకాలు కూడా తిని ఉంటారు. చికెన్, పప్పు అంటే ఇష్టం ఉందని తెలుగు వాడు ఉండడంటే నమ్మశక్యం కాదు. కానీ మీరెప్పుడైనా చికెన్ పప్పు తిన్నారా? మన పూర్వికులు గతంలో దీనిని ఎక్కువగా చేసుకుని తినేవారట. దీనిని చేసుకోవడం చాలా సులభం. రుచి మాత్రం మీరు ఊహించినదానికంటే అద్భుతంగా ఉంటుంది. ఈ చికెన్ పప్పును ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**చికెన్ పప్పు తయారీకి కావాల్సిన పదార్థాలు**

ఒక కప్పు కందిపప్పు అరకిలో చికెన్ అర టీస్పూన్ ఆవాలు అరటీస్పూన్ జీలకర్ర రెండు ఉల్లిపాయలు ఒక పెద్ద టమాటో 50%ఎశ్రీ% నూనె మూడు పచ్చిమిర్చి కరివేపాకు ఒక టీస్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ రెండు టీస్పూన్ల కారం రుచికి సరిపడా ఉప్పు అర టీస్పూన్ పసుపు ఒక టీస్పూన్ ధనియాల పొడి అర టీస్పూన్ జీలకర్ర పొడి పావు టీస్పూన్ గరం మసాలా కొత్తిమీర ఒక కప్పు నీరు చికెన్ పప్పు తయారీ విధానం ముందుగా ఒక పాన్ తీసుకొని అందులో 50%ఎశ్రీ% నూనె పోసుకోవాలి. ఆ తరువాత అందులో అర టీస్పూన్ జీలకర్ర, అర టీస్పూన్ ఆవాలు వేసుకోవాలి. అవి చిటపటా అవుతుండగా సన్నగా తురుముకున్న ఉల్లియాపాయ ముక్కలను వేసుకోవాలి. వాటితో పాటు చీల్చి పెట్టుకున్న మూడు పచ్చిమిర్చి, కొన్ని కరివేపాకులు వేసుకొని వాటిని బాగా వేయించుకోవాలి. ఆ తరువాత అందులో ఒక టీస్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసుకొని పచ్చి వాసన పోయేవరకు వేయించుకోవాలి. ఆ తరువాత అందులో అరకిలో చికెన్ వేసుకొని ఆ చికెన్ నీళు వదిలేసేంత వరకు కలుపుకోవాలి. చికెన్ కొంచెం ఉడికిన తరువాత సన్నగా కట్ చేసుకున్న టమాటోలు, రెండు టీస్పూన్ల కారం, రుచికి సరిపడా ఉప్పు, ఒక టీస్పూన్ ధనియాల పొడి, అర టీస్పూన్ జీలకర్ర పొడి, పావు టీస్పూన్ గరం మసాలా వేసుకోవాలి. ఆ తరువాత ఆ మసాలా మొత్తం చికెన్‌కు పట్టుకునే విధంగా బాగా కలుపుకోవాలి. ఇలా కలుపుకున్న తరువాత చికెన్‌లోని నూనె పైకి తెర్లిన తరువాత అందులో ముందుగా ఉడకపెట్టుకున్న కందిపప్పు వేసుకోవాలి. అలాగే ఒక కప్పు నీరు కూడా వేసుకోవాలి. మొత్తం ఓసారి కలుపుకోవాలి. అనంతరం వాటిని ఒక పది నిమిషాల పాటు ఉడికించుకొని అందులో కొత్తిమీర చల్లుకుని దించుకుంటే ఎంతో రుచికరమైన టేస్టీ, టేస్టీ చికెన్ పప్పు సిద్ధమైనట్లే. దీని రుచి మాత్రం అద్భుతంగా ఉంటుంది. ఒక్కసారి తింటే జీవితంలో మళ్ళీ పప్పు జోలికి వెళ్ళరు.

## వాలంటైన్స్ డే స్పెషల్ రెసిపి.. రెడ్ వెల్వెట్ కప్ కేకు



ప్రపంచంలోని చాలా దేశాల్లో ఫిబ్రవరి 14ని వాలంటైన్స్ డేగా జరుపుకుంటారు. వాలంటైన్స్‌డే రోజున మీ ప్రియమైన వారికి ప్రత్యేకంగా ఏదైనా తినిపించాలనుకుంటే రెడ్ వెల్వెట్ కేక్ బెస్ట్ ఆప్షన్. రెడ్ వెల్వెట్ కప్‌కేక్ అనేది ఒక ప్రసిద్ధ డెజర్ట్,ఇది దాని ప్రత్యేకమైన ఎరుపు రంగు, రుచికి ప్రసిద్ధి చెందింది. తరచుగా వేడుకలు,ప్రత్యేక సందర్భాలలో తయారు చేయబడతాయి.రెడ్ వెల్వెట్ కప్‌కేక్‌లు రుచికరమైనవి మాత్రమే కాకుండా వాటిలో కొన్ని పోషక విలువలు కూడా ఉన్నాయి. వాలంటైన్స్ డే స్పెషల్‌గా ఎగ్‌లెస్ రెడ్ వెల్వెట్ కప్ కేకుని ఇంట్లోనే ఈజీగా ఎలా తయారు చేసుకోవచ్చో ఇక్కడ చూడండి.

ఎగ్ లెస్ రెడ్ వెల్వెట్ కప్ కేకు తయరీకి కావాల్సిన పదార్థాలు -పచ్చిపాలు- 120 -వెనిగర్- 1.5 టేబుల్ స్పూన్ -మైదా పిండి-160 గ్రాములు -కోకో పౌడర్-1 టేబుల్ స్పూన్ -బేకింగ్ సోడా-1/2 టేబుల్ స్పూన్ -బేకింగ్ పౌడర్-1/2 టేబుల్ స్పూన్ -రిఫైన్డ్ ఆయిల్-120 ఎంఎల్-పెరుగు-60 గ్రాములు -చక్కెర-150 గ్రాములు -రెడ్ జెల్ ఫుడ్ కలర్-1 టేబుల్ స్పూన్ -వెన్నిలా ఎక్స్ ట్రాక్ట్-1.5 టేబుల్ స్పూన్ -అన్ సాల్టెడ్ బటర్-115 గ్రాములు -పంచదార పౌడర్-240 గ్రాములు -క్రీమ్ చీజ్-225 గ్రాములు -వెన్నిలా ఎసెన్స్-కొంచెం -ఉప్పు-రుచికి తగినంత ఎగ్ లెస్ రెడ్ వెల్వెట్ కప్ కేకు తయరీ విధానం -ముందుగా పచ్చిపాలలో వెనిగర్ వేసి కలిపి 10 నిమిషాలు పక్కనపెట్టుకోండి. -తర్వాత ఒక బౌల్ మీద జాలి పెట్టి అందులో మైదా పిండి, కోకో పౌడర్, బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా జల్లించి పక్కనపెట్టుకోవాలి. -తర్వాత మరో బౌల్ లో చిక్కనిపెరుగు, వెనిగర్ కలిపి ఉంచిన పాల మిశ్రమాన్ని, రిఫైన్డ్ ఆయిల్, చక్కెర, రెడ్ జెల్ ఫుడ్ కలర్, వెన్నిలా ఎక్స్ ట్రాక్ట్ వేసి కలపండి. చక్కెర పూర్తిగా కరిగేదాకా బీట్ చేయాలి. -ఇప్పుడు ముందుగా జల్లించి పక్కనపెట్టుకున్న పిండిని మూడు భాగాలుగా విభజించి అందులో ఒక భాగాన్ని ఇందులో వేసి బాగా కలపండి. -ఇప్పుడు కప్‌కేక్ లైనర్ ట్రే తీసుకొని 12 కప్ మఫిన్ టిన్ ను లైన్ చేయండి. -ఇప్పుడు కప్ కేకు లైనర్స్ లో రెడీ చేసిన పిండిని పూర్తిగా కాకుండా సగం సగం వరకు నింపండి. -తర్వాత ఓ టూత్ పిక్ తీసుకొని ఆ పిండిని కొంచెం కలబెట్టి తిప్పండి చాలు. -ఇప్పుడు ఓవెన్ లో ఈ ట్రేని ఉంచి 170 డిగ్రీల దగ్గర 20 నిమిషాల వరకు బేక్ చేసి తర్వాత బయటకు తీసి ఓ టూత్ పిక్ తో చెక్ చేయండి. పర్ఫెక్ట్ గా వస్తే ఈ ట్రేని బయటకు తీసి చల్లారనివ్వండి. -తర్వాత అన్ సాల్టెడ్ బటర్ లో పంచదార పొడి వేసి బాగా బీట్ చేసిన తర్వాత ఇందులోనే క్రీమ్ చీజ్ వేసి బీట్ చేయండి. ఇందులోనే కొంచెం వెన్నిలా ఎసెన్స్ కూడా వేసి బాగా బీట్ చేసి అరగంట పాటు దీన్ని ఫ్రిడ్జ్ లో పెట్టుకోండి.-తర్వాత చల్లారిన కప్ కేకుని ట్రే నుంచి బయటకు తీసి కేకు మీద ఫ్రిడ్జ్ లో ఉంచి మిశ్రమంతో మీకు నచ్చిన విధంగా డెకరేట్ చేసుకోండి. అంతే ఎగ్ లెస్ రెడ్ వెల్వెట్ కప్ కేకు రెడీ.

## చికెన్ రోస్ట్




మీకు నాన్ వెజ్ ఇష్టమైతే, చికెన్‌తో కొత్త వంటకాలను ప్రయత్నించడం ఇష్టం ఉంటే, ఈ అస్సామీ స్టైల్ రోస్టెడ్ చికెన్ రెసిపీ మీరు తప్పకుండా ట్రై చేయాలి. సాధారణ చికెన్ ఫ్రైతో పోలిస్తే ఇది ఎంతో రుచికరంగా ఉంటుంది. అలాగే చేసుకోవడం కూడా అత్యంత సులభం. కేవలం సాధారణమైన పద్దతిలో చేసుకునే ఈ వంట ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

రోస్టెడ్ చికెన్ రెసిపీకి కావాల్సిన పదార్థాలు చికెన్ – 500 గ్రాములు ఉప్పు – రుచికి సరిపడా పసుపు – 1స్పూను, కారం – 1 స్పూను, జీలకర్ర పొడి – 1 స్పూను, మిరియాల పొడి – 1 స్పూను, నిమ్మరసం – 3 స్పూను, నల్ల నువ్వులు –్వా కప్పు నూనె – 4 స్పూను, వెల్లుల్లి పేస్ట్ – 1 స్పూను, అల్లం పేస్ట్ – 2 స్పూను, ఉల్లిపాయ ముక్కలు – అరకప్పు

రోస్టెడ్ చికెన్ తయారీ విధానం ముందుగా చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి ఒక గిన్నెలో ఉంచాలి. అందులో ఉప్పు, పసుపు, కారం, జీలకర్ర పొడి, మిరియాల పొడి, నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని 20 నిమిషాలు మెరినేట్ చేయాలి. ఆ తరువాత, ఒక పాన్ వేడి చేసి అందులో నల్ల నువ్వులను వేసి 1 నిమిషం వేయించాలి. వేయించిన నువ్వులు చల్లార్చి, మిక్సీ జార్‌లో వేసి నూనె, వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయలు వేసి గ్రైండ్ చేసి పేస్ట్ గా చేసుకోవాలి. ఇప్పుడు ఈ పేస్టును పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మెరినేట్ చేసిన చికెన్ నుంచి అదనపు నీటిని తీసి, ఇంతకు ముందు చేసుకున్న పేస్ట్‌ను చికెన్‌లో బాగా కలపాలి. తర్వాత, మరో 30 నిమిషాలు మెరినేట్ చేయాలి. ఈ మధ్యలో, మీ మైక్రోవేవ్ ఓవెన్‌ను 180 డిగ్రీలకు ప్రీహీట్ చేయండి. ప్రీహీట్ చేసిన ఓవెన్‌లో ట్రేలో చికెన్ ముక్కలను పెట్టి 30 నిమిషాలు ఉడికించాలి. 30 నిమిషాలు ఉడికాక.. చికెన్‌ను ఓవెన్ నుంచి తీసి వెంటనే నెయ్యి లేదా వెన్నతో పూయండి. అంతే రుచికరమైన అస్సామీ రోస్టెడ్ చికెన్ రెడీ.

## చుక్క ఆయిల్ అక్కర్లేదు..ఈ మంగళూరు రెసిపి జీవితంలో ఒక్కసారైనా తిని తీరాల్సిందే



కరోనా తర్వాత నుంచి అందరిలోనూ ఆరోగ్యం పట్ల శ్రద్ద విపరీతంగా పెరిగిపోయింది. ఈ క్రమంలో ఆయిల్ ఫుడ్ ని తగ్గించి ఆరోగ్యంగా ఉండే ఫుడ్ వైపు చాలామంది మెగ్గుచూపుతున్నారు. సాక్షాత్తూ మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఆయిల్ వాడకం తగ్గించాలని పిలుపునిచ్చారు. అయితే చుక్క ఆయిల్ లేకుండా చేసే రెసిపిలు చాలానే ఉన్నాయి. అలాంటి వాటిల్లో నీరు దోశ ఒకటి. మంగళూరులో నీరు దోసె చాలా ఫేమస్. కర్ణాటకలో ఏ మూలకు వెళ్లిన అక్కడి రెస్టారెంట్లలో మంగళూరు స్పెషల్ నీర్ దోశ దొరుకుతుంది. దీనిని మీ ఇంట్లో కూడా ఫర్ఫెక్ట్ గా చేసుకోవాలంటే కొన్ని టిప్స్ పాటించాలి. మంగళూరు స్పెషల్ నీరు దొశ తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.


నీరు దోశ తయారీకి కావాల్సిన పదార్థాలు -ఇడ్లీ బియ్యం లేదా రేషన్ బియ్యం -పచ్చి కొబ్బరి -ఉప్పు నీరు దోశ తయారీ విధానం - ముందుగా 1 కప్పు ఇడ్లీ బియ్యం లేదా రేషన్ బియ్యాన్ని శుభ్రంగా కడిగి నీళ్లలో వేసి కనీసం 6 గంటలు నానబెట్టండి. -తర్వాత నానిన బియ్యాన్ని కూడా రెండు సార్లు కడిగి తర్వాత దానిని మిక్సీ గిన్నెలో వేసి అందులోనే కొన్ని నీళ్లు, కొన్ని పచ్చి కొబ్బరిముక్కలు వేసి మెత్తటి పేస్ట్ లా చేసుకోవాలి.

– తర్వాత అందులో రుచికి సరిపడా ఉప్పు వేసి అవసరమనుకుంటే ఇంకొంచెం నీళ్లు కూడా పోసి బాగా పలుచగా పిండి కలుపుకోవాలి. -ఇప్పుడు స్టవ్ మీద ధోశ పెనం పెట్టి ఉల్లిపాయతో రుద్ది రవ్వ దోశ ఎలా వేసుకుంటామో ఆ విధంగా వేసుకోండి. అంతే నారుోశ రెడీ. -ఈ నీరు దోశని చికెన్ లేదా మటన్ కుర్మాతో గానీ లేదా మీకు నచ్చిన చట్నీతో తింటే టేస్ట్ యమా రుచిగా ఉంటుంది.

# సినిమా న్యూస్



## 'ధురంధర్' విజయ ప్రస్థానం: తెరవెనుక సైన్యానికి రాయల్టీ ఏదీ?




ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద -ధురంధర్: ది రివెంజ్- సృష్టిస్తున్న బాక్సాఫీస్ ప్రభంజనం భారతీయ సినిమా గమనాన్ని మారుస్తోంది. ఈ భారీ విజయం నేపథ్యంలో చిత్ర కథానాయిక సారా అర్జున్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన భావోద్వేగపూరిత పోస్ట్ నెటిజన్ల మనసు గెలుచుకుంటోంది. సాధారణంగా ప్రేక్షకులు తెరపై కనిపించే నటీనటుల గ్లామర్‌ను మాత్రమే చూస్తారు.. కానీ ఈ సినిమా వెనుక ఉన్న వందలాది మంది టెక్నీషియన్ల శ్రమను నటి సారా అర్జున్ ప్రత్యేకంగా కొనియాడారు. దర్శకుడు ఆదిత్య ధర్‌ను మొదటిసారి కలిసినప్పుడే ఆయన భారతీయ సినిమాలో ఏదో ఒక అద్భుతం చేయబోతున్నారని తనకు అనిపించిందని.. ఈ -ధురంధర్- ఫ్రాంఛైజీతో అది నిజమైందని పేర్కొన్నారు. సినిమా షూటింగ్ సమయంలో ప్రతి చిన్న విషయంలో టీమ్ చూపిన శ్రద్ధ ప్రాజెక్ట్ విజన్ విషయలో ఉన్న స్పష్టత ఈ అసాధారణ విజయానికి పునాది అని చెప్పవచ్చు. లైట్ మెన్ల నుండి సౌండ్ ఇంజనీర్ల వరకు పేరు తెలియని ప్రతి ఒక్క గుర్తింపుకు నోచుకోని తెరవెనక హీరోల శ్రమను సారా ఈ విజయానికి అంకితం చేశారు. సినిమాటోగ్రఫీ, విజువల్ ఎఫెక్ట్స్ , స్టంట్ క్రూ, ప్రొడక్షన్ డిజైనర్లు అహోరాత్రులు పడిన కష్టాన్ని సారా తన నోట్‌లో విడమర్చి చెప్పారు. నటీనటులు కేవలం పోస్టర్లపై మాత్రమే కనిపిస్తారని.. కానీ సినిమాకు అసలైన వెన్నెముక సాంకేతిక నిపుణులేనని ప్రశంసించారు. ఈ పోస్ట్‌పై స్పందించిన నటి యామీ గౌతమ్ ధర్ కూడా సారాను --ప్రస్తుతంలోను, భవిష్యత్తును ఏలే నటి-- అని ప్రశంసించడం విశేషం. అయితే సారా ప్రశంసలు సరే కానీ.. ఒక సినిమా సాధించే భారీ ప్రాచుర్యం.. ఆర్థిక ప్రయోజనాలు సాంకేతిక నిపుణులకు ఏ మేరకు అందుతున్నాయనేది ఒక చర్చనీయాంశం. సామాన్య ప్రేక్షకులు సినిమాను కేవలం హీరో లేదా హీరోయిన్ ముఖచిత్రంగానే చూస్తారు కాబట్టి.. విజయం దక్కినప్పుడు వచ్చే క్రెడిట్ ఎక్కువగా నటీనటులకే వెళ్తుంది. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియా ప్రభావం వల్ల ఎడిటర్లు, సినిమాటోగ్రాఫర్ల గురించి కొంత చర్చ జరుగుతున్నా.. అది కేవలం ఒక వర్గానికి మాత్రమే పరిమితం అవుతోంది. నటీనటుల స్థాయిలో సాంకేతిక నిపుణులకు గుర్తింపు రావడానికి ఇంకా సమయం పట్టేలా ఉంది. ముఖ్యంగా భారతీయ సినీపరిశ్రమలో రచయితలకు కూడా గుర్తింపు పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆర్థిక కోణంలో చూస్తే.. తారలతో పోలిస్తే సాంకేతిక నిపుణుల పారితోషికాల విషయంలో తీవ్రమైన వ్యత్యాసాలు కనిపిస్తాయి. సినిమా బడ్జెట్‌లో సింహభాగం నటీనటులకే కేటాయించడం ఇటీవల చూస్తున్నాం. ఒక తెలుగు సినిమాకి సగం బడ్జెట్ కేవలం స్టార్ హీరోకే కేటాయించడం చూస్తున్నాం. పైగా వారు లాభాల్లో వాటాలు కూడా అందుకుంటారు. కానీ తెరవెనుక ఉండే పెద్ద టెక్నీషియన్లను మినహాయిస్తే.. ఇతర క్రాఫ్టులలో అధికంగా శ్రమించే లైట్ మెన్, సెట్ అసిస్టెంట్స్ వంటి కింది స్థాయి టెక్నీషియన్లకు కేవలం నిర్ణీత వేతనం మాత్రమే లభిస్తుంది. ధురంధర్ వంటి చిత్రం రూ. 1000 కోట్లు వసూలు చేసినా క్షేత్రస్థాయిలో చెమటోడ్చిన కార్మికుల ఆర్థిక స్థితిగతుల్లో చెప్పుకోదగ్గ మార్పు రాదు. ఈ అసమానతలు పరిశ్రమలోని శ్రమ విభజనలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతున్నాయి. పరిశ్రమలో మార్పులు మొదలైన మాట వాస్తవమే. రాజమౌళి, ప్రశాంత్ నీల్, ఏ.ఆర్. రెహమాన్ వంటి దిగ్గజాల వల్ల అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులకు ఇప్పుడు ఒక -బ్రాండ్ ఇమేజ్- వస్తోంది. కానీ ఈ గుర్తింపు కింది స్థాయి వరకు చేరాల్సి ఉంది. సినిమా విజయం సాధించినప్పుడు అది కేవలం కొద్దిమందికి మాత్రమే కాకుండా.. ప్రతి ఒక్క సాంకేతిక నిపుణుడికి గౌరవాన్ని, మెరుగైన పారితోషికాన్ని అందించినప్పుడే -ధురంధర్- వంటి చిత్రాలు సాధించిన విజయానికి నిజమైన అర్థం లభిస్తుంది. టెక్నీషియన్లకు అందాల్సిన పారితోషికం, గుర్తింపు మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సారా అర్జున్ గుర్తించినట్టే సినీపరిశ్రమల్లోని అగ్ర హీరోలు, నిర్మాతలు, దర్శకులు కూడా తెరవెనక హీరోలను గుర్తించి వారికి ఆర్థిక స్వావలంభన సాధించుకునేలా సహకరించడం చాలా అవసరం.



## స్త్రీలకు అవమానం.. నోరా ఫతేహీపై మహిళా కమిషన్ సీరియస్!

సినిమా ప్రమోషన్ల కోసం వివాదాస్పద సాహిత్యం లేదా దృశ్యాలను విడుదల చేయడం అనేది నేడు ఒక బాధ్యతారాహిత్యమైన -పబ్లిసిటీ స్టంట్-గా మారుతోంది. సెన్సార్ బోర్డు (సీబీఎఫ్‌సి) నిబంధనలు ప్రధానంగా థియేటర్లలో ప్రదర్శించే వెర్షన్‌కే పరిమితం కావడంతో డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో విడుదలయ్యే ప్రమోషనల్ కంటెంట్‌ను నిర్మాతలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఈ గ్రే ఏరియాను అడ్డుకోవడానికి సెన్సార్ బోర్డు తన పరిధిని డిజిటల్ మాధ్యమాలకు కూడా విస్తరించాల్సిన అవసరం ఉందని విశ్లేషిస్తున్నారు. కేవలం కట్స్ చెప్పడమే కాదు.. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై భారీ జరిమానాలు విధించడం ద్వారానే ఇటువంటి ధోరణులకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. మహిళా కమిషన్ వంటి రాజ్యాంగబద్ధమైన సంస్థల జోక్యం ఇక్కడ అత్యంత కీలకం. సెన్సార్ బోర్డు కేవలం సాంకేతికపరమైన తనిఖీలు చేస్తే.. మహిళా కమిషన్ సమాజంలోని నైతిక విలువలు, మహిళల గౌరవానికి భంగం కలిగే ప్రతి సందర్భంలోనూ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తుంది. -కేడీ – ది డెవిల్- సినిమా విషయంలో నోరా ఫతేహి, సంజయ్ దత్ వంటి అగ్ర తారలను నేరుగా విచారణకు పిలవడం వల్ల సృజనాత్మకత పేరుతో అశ్లీలతను ప్రోత్సహించే మేకర్స్‌కు ఒక బలమైన హెచ్చరిక వెళ్లినట్టయింది. చట్టపరమైన చర్యల భయం ఉన్నప్పుడే బాధ్యతాయుతమైన సినిమా మేకింగ్ సాధ్యమవుతుంది. అయితే ఇటువంటి నియంత్రణలు -సృజనాత్మక స్వేచ్ఛ-ను దెబ్బతీస్తాయనే వాదన కూడా వినిపిస్తుంటుంది. కానీ స్వేచ్ఛ అనేది సామాజిక బాధ్యతతో కూడి ఉండాలి. కళాకారులు, దర్శకులు తాము చేసే పని సమాజంపై ముఖ్యంగా యువతపై ఎటువంటి ప్రభావం చూపుతుందో ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం, సెన్సార్ బోర్డు సమన్వయంతో ఒక స్పష్టమైన -డిజిటల్ ప్రమోషన్ పాలసీ-ని తీసుకురావాల్సిఉందని విశ్లేషిస్తున్నారు. అప్పుడే సినిమా పబ్లిసిటీ అనేది వివాదాల చుట్టూ కాకుండా.. సినిమాలోని ప్రతిభ, కంటెంట్ చుట్టూ తిరుగుతుంది. నోరా ఫతేహి- సంజయ్ దత్‌పై మహిళా కమిషన్ సీరియస్: కన్నడ చిత్రం -కేడీ – ది డెవిల్-లో నోరా ఫతేహి, సంజయ్ దత్ నటించిన -సర్కే నిన్న సెరగా సర్కే- పాటపై తలెత్తిన వివాదం జాతీయ స్థాయికి చేరింది. ఈ పాటలోని అశ్లీల సాహిత్యం, అసభ్యకర దృశ్యాల పట్ల సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమైన తీవ్ర నిరసనలను జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) సుమోటోగా స్వీకరించింది. సృజనాత్మకత పేరుతో మహిళల హుందాతనాన్ని దెబ్బతీయడం సహించరానిదని కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ స్పష్టం చేస్తూ.. చిత్ర బృందానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే ఈ వివాదాస్పద గీతాన్ని యూట్యూబ్ నుండి తొలగించినా.. ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలకు కమిషన్ ఉపక్రమించింది. ఈ కేసుకు సంబంధించి జరిగిన తొలి విచారణకు చిత్ర దర్శకుడు ప్రేమ్, రచయిత రకీబ్ ఆలం, నిర్మాతలు హాజరై, సమాజంపై ఈ పాట ప్రతికూల ప్రభావం చూపిందని ఒప్పుకుంటూ లిఖితపూర్వక క్షమాపణలు తెలిపారు. అయితే నటి నోరా ఫతేహి ఈ విచారణకు గైర్హాజరు కావడంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమె తరఫున న్యాయవాది హాజరైనా లాయర్ ప్రాతినిధ్యాన్ని తిరస్కరిస్తూ ఏప్రిల్ 27న నోరా వ్యక్తిగతంగా కమిషన్ ముందుకు రావాలని తుది అవకాశం ఇచ్చింది. అలాగే నటుడు సంజయ్ దత్‌ను కూడా ఏప్రిల్ 8న ప్యానెల్ ముందు హాజరు కావాల్సిందిగా కమిషన్ ఆదేశించింది. కేవలం క్షమాపణలతో సరిపెట్టకుండా, ఈ వివాదం నేపథ్యంలో చిత్ర బృందానికి కమిషన్ కొన్ని కీలక బాధ్యతలను అప్పగించింది. ఒక మూడు నెలల పాటు మహిళా సాధికారతకు సంబంధించి వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టి.. ఆ నివేదికను కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించింది. సినిమాల్లో గ్లామర్ పేరుతో అశ్లీలతను ప్రోత్సహించే ధోరణిని అరికట్టడానికి, కళాకారులు సమాజం విషయంలో జవాబుదారీతనంతో వ్యవహరించేలా చూడటానికి మహిళా కమిషన్ తీసుకున్న ఈ నిర్ణయం పరిశ్రమలో ఒక బలమైన సంకేతాన్ని పంపింది.



## సినిమాల నుంచీ రిటైర్మెంట్ తీసుకోబోతున్న త్రిష?

దక్షిణాది చిత్ర పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా తనదైన ముద్ర వేసిన స్టార్ హీరోయిన్ త్రిష, త్వరలో సినిమాలకు స్వస్తి పలకనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్ నగర్ వర్గాలు. గత కొన్ని రోజులుగా ఆమె రిటైర్మెంట్ గురించి సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వస్తుండగా, తాజాగా ప్రముఖ నటుడు మరియు దర్శకుడు చిత్ర లక్ష్మణన్ చేసిన వ్యాఖ్యలు ఈ ప్రచారానికి మరింత బలాన్ని చేకూర్చాయి. త్రిష నిర్ణయం వెనుక అసలు కారణమేంటో అని అభిమానులు ఇప్పుడు తెగ ఆరా తీస్తున్నారు. యూట్యూబ్ వేదికగా ఒక నెటిజన్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ చిత్ర లక్ష్మణన్ సంచలన విషయాలు బయట పెట్టారు. త్రిష ఇకపై సినిమాల్లో కొనసాగాలని అనుకోవడం లేదని, తనకు వస్తున్న కొత్త అవకాశాలను కూడా ఆమె సున్నితంగా తిరస్కరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దీనిపై కొందరు నిర్మాతలని సంప్రదించగా వారు కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించినట్లు ఆయన తెలిపారు. సాధారణంగా ఇండస్ట్రీలో ఏదైనా విషయంపై పూర్తి క్లారిటీ ఉంటేనే చిత్ర లక్ష్మణన్ మాట్లాడతారని పేరు ఉండటంతో, ఈ వార్త ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం త్రిష చేతిలో రెండు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. సూర్య హీరోగా ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కరుప్పు' సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని, మే 14న విడుదలకు సిద్ధంగా ఉంది. ఇక దీనితో పాటు మెగాస్టార్ చిరంజీవి సరసన ఆమె నటించిన సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' కూడా షూటింగ్ ముగించుకుంది. ఈ సినిమా జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఈ రెండు పెద్ద సినిమాలు విడుదలైన తర్వాతే ఆమె తన కెరీర్ విషయంలో ఏదైనా అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. నిజానికి త్రిష లాంటి సీనియర్ హీరోయిన్ రిటైర్మెంట్ తీసుకుంటున్నారన్న వార్త ఫ్యాన్స్‌కు మింగుడుపడటం లేదు. సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా వరుస విజయాలతో దూసుకుపోతున్న త్రిష, ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకుంటున్నారా అని అందరూ చర్చించుకుంటున్నారు. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు త్రిష టీమ్ నుంచి కానీ, ఆమె నుంచి కానీ ఎలాంటి స్పందన రాలేదు. మరి ఈ వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియాలంటే త్రిష స్వయంగా క్లారిటీ ఇవ్వాలని కోరుకున్నారు. స్పందించిన త్రిష: అయితే ఈ రూమర్స్ పై త్రిష స్పందించింది. ముఖ్యంగా తాను సినిమాలకు గుడ్ బై చెప్పబోతున్నాను అంటూ వస్తున్న వార్తలపై ఆమె స్పందిస్తూ.." నేను సినిమాలకు దూరం కాబోతున్నానట.. ఇక ఇలాంటి రూమర్లు స్ప్రెడ్ చేయడం తగదు.. ఇంకా ఏమైనా ఉంటే ఆ రూమర్లన్నింటినీ ఈరోజుతో ఆపేయండి " అంటూ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చింది త్రిష.

## ఎంతైనా మెగా ఫ్యామిలీ కదా...! అనీల్ రావిపూడి పంచ్!!



ప్రస్తుతం టాలీవుడ్‌లో చిన్న చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతున్నాయి. ఈ క్రమంలో -రాకాస- చిత్రం సాధించిన విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సమ్మర్ బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌లో స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా విచ్చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెగా ఫ్యామిలీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. నిహారిక కొణిదెల ఫోన్ చేసి ఈవెంట్‌కు వస్తున్నారు కదా! అని కోరగానే..ముంబై వెళ్లాల్సిన షెడ్యూల్ ఉన్నా.. కాదనలేక వచ్చానని.. ఎంతైనా మెగా ఫ్యామిలీ కదా...! అంటూ సరదాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రేక్షకులను అలరించాయి. ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరించిన నిహారికను అనిల్ రావిపూడి -మోస్ట్ ప్యాషనేట్ ప్రొడ్యూసర్- అని అభివర్ణించారు. సినిమా పై తనకు ఉన్న అంకితభావం.. ప్రమోషన్ల కోసం ఆమె పడే కష్టం గొప్పదని కొనియాడారు.

# ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలి

## - ఆరోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తలు సేవలు అమూల్యం

## - జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 7 : ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తల సేవలు అమూల్యమైనవని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. మంగళవారం టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆశా కార్యకర్తలకు ఆశా డే శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ వరకు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిని పక్కద్బందీగా అమలు చేయాలని వైద్య సిబ్బందికి ఆయన సూచించారు. ఆశా కార్యకర్తలు గ్రామ, మండల స్థాయిలో గర్భిణిలు సుఖ ప్రసవాలు జరిగేలా, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ మాతా శిశు మరణాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఆసుపత్రిలో ఎంతమందికి వైద్య సేవలు అందిస్తున్నారు, ఏ ఏ ప్రాంతాల నుండి వైద్య సేవలకు వస్తున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు 70 మంది వరకు వైద్య సేవలకు వస్తున్నారని వైద్యులు తెలుపగా ఓపి సేవలు పెంచాలని సూచించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పోషణ లోపం ఉన్న చిన్నారులు ఎంత మంది ఉన్నారు అని అడిగి తెలుసుకున్నారు. పోషణ లోపం ఉన్న చిన్నారులు లేరని తెలుపగా అభినందించారు. గ్రామం, మండలం వారిగా పోషణ లోపం ఉన్న చిన్నారుల జాభితా తయారు చేయాలని సూచించారు. బాల్యం నుండి ఆరోగ్యవంతమైన సమాజం తయారు కావాలని స్పష్టం చేసారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబొరేటరీని పరిశీలించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పరీక్షల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ స్వరూప రాణి, ఎంపీడీవో అనిత, వైద్యులు డాక్టర్ నాగరాణి, హారిక, సర్పంచ్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# 'సిటీ ఆఫ్ లైట్స్'తో ప్రపంచాన్ని ఆకట్టుకున్న భూపాలపల్లి యువకుడు

## అంతర్జాతీయ గుర్తింపు సాధించిన అరుణ్ నలిమెల - తెలంగాణకు గౌరవం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 7 : అంతర్జాతీయ వేదికపై తెలంగాణ ప్రతిభ మరొకసారి ప్రతిధ్వనించింది. ప్రతిష్ఠాత్మకమైన స్మిత్సోనియన్ మ్యాగజైన్ నిర్వహించిన అంతర్జాతీయ ఫోటోగ్రఫీ పోటీలో భూపాలపల్లికి చెందిన యువ ఫోటోగ్రాఫర్ అరుణ్ నలిమెల తీసిన చిత్రం ఎంపిక కావడం విశేషం. ప్రపంచం నలుమూలల నుంచి వేలాది ఎంట్రీలు పోటీపడిన ఈ పోటీలో అరుణ్ ఫోటో ప్రత్యేకంగా నిలవడం ఆయన ప్రతిభకు నిదర్శనం. 'సిటీ ఆఫ్ లైట్స్' – సంస్కృతి, భక్తి కలయిక వారణాసిలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు వెలిగించిన ప్రమిదల మధ్య ఒక మహిళ నడుచుకుంటూ వెళ్తున్న అరుదైన దృశ్యాన్ని అరుణ్ తన కెమెరాలో బంధించారు. "సిటీ ఆఫ్ లైట్స్" అనే శీర్షికతో సమర్పించిన ఈ ఫోటోలో భారతీయ ఆధ్యాత్మికత, సంప్రదాయం, వెలుగుల ఆహ్లాదం సమ్మిళితమై ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇది కేవలం ఒక ఫోటో కాకుండా, భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచింది. స్థానిక ప్రతిభ నుంచి అంతర్జాతీయ గుర్తింపు వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన 33 ఏళ్ల అరుణ్ 2013లో తన అన్నయ్య స్ఫూర్తితో ఫోటోగ్రఫీ ప్రయాణం ప్రారంభించారు. మొదట వన్యప్రాణుల ఫోటోగ్రఫీతో మొదలైన ఆయన ప్రయాణం, తరువాత భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైపు మళ్లింది. ఈ మార్పు ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. అరుణ్ ప్రతిభను గతంలోనే దేశ ప్రధాని నరేంద్ర మోదీ "మన్ కి బాత్" కార్యక్రమంలో ప్రస్తావించడం గర్వకారణం. ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై ఎంపిక కావడం ద్వారా ఆయన ప్రతిభ మరింత విశ్వవ్యాప్తమైంది.

కాగా అరుణ్ సాధించిన ఈ విజయం గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన యువకుడు ప్రపంచ స్థాయిలో నిలవడం యువతకు ప్రేరణగా నిలవడంతో పాటు భారతీయ సంస్కృతిని సృజనాత్మకంగా చూపిస్తే ప్రపంచం గుర్తిస్తుందనే సందేశం ఇచ్చింది. అంతేకాకుండా, డిజిటల్ యుగంలో ఫోటోగ్రఫీని వృత్తిగా ఎంచుకునే వారికి ఇది ఒక మార్గదర్శకంగా మారడమే కాకుండా తెలంగాణ కళాత్మక ప్రతిభ అంతర్జాతీయంగా గుర్తింపు పొందుతున్న దానికి ఇది మరో ఉదాహరణగా నిలిచింది. అరుణ్ సాధించిన ఈ ఘనతపై సహచర ఫోటోగ్రాఫర్లు, మిత్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు. మొత్తంగా, అరుణ్ నలిమెల విజయం వ్యక్తిగత ప్రతిభకే కాకుండా తెలంగాణ సాంస్కృతిక విలువలకు అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిన ఘన ఘట్టంగా నిలిచింది.

# గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ వైద్య సేవలకు భద్రాద్రి జిల్లా కు రాష్ట్ర స్థాయి గుర్తింపు

## - భద్రాద్రి-కొత్తగూడెం టీవీవీపీ ఆసుపత్రులకు అత్యధిక అవార్డులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఏప్రిల్ 7 : ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రకటించిన అవార్డుల్లో గిరిజన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం విశిష్ట స్థానం సంపాదించింది. జిల్లా డీసీహెచ్ఎస్ డా.రవి బాబు పరిధిలోని వైద్య విధాన పరిషత్ (టీవీవీపి) ఆసుపత్రులు అత్యధిక అవార్డులు సాధించడం విశేషం. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలు అందించడంలో చూపిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా మంగళవారం అవార్డుల ప్రదానం హైదరాబాద్ లోని రవీంద్రభారతి లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా, కమిషనర్ ఫ్యామిలీ అండ్ హెల్త్ సంగీత, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ తో పాటు ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈ అవార్డులు అందుకున్న వారిలో సీ.హెచ్.సీ. పాల్వంచకు చెందిన డా.శైలేష్ కుమార్ (ఆర్థో), డా.పి.రాంప్రసాద్ (అనస్తీషియా), ఏరియా హాస్పిటల్ భద్రాచలం నుంచి డా.క్రపా విజయ్ (పెడియాట్రిక్స్), నర్సింగ్ ఆఫీసర్ కృష్ణవేణి, అబాస్ సేవలలో ఎ.వెంకట రావు (98 శాతం), అలాగే ల్యాబ్ సేవల విభాగంలో భద్రాచలం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ కృష్ణ ఉన్నారు. ఏరియా హాస్పిటల్ మనుగూరు నుంచి నర్సింగ్ ఆఫీసర్ మానస, సీఎంఎస్ ఇంచార్జ్ ఫార్మాసిస్ట్ గ్రేడ్--× , ఏ.శారద అవార్డులు అందుకున్నారు. అదనంగా భద్రాచలం, మనుగూరు, చర్ల వంటి గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇన్ ట్రైబల్ ఏరియా" విభాగంలో డీసిహెచ్ఎస్ డాక్టర్ జి.రవి బాబు మూడు అవార్డులు ఆయా సూపరింటెండెంట్లు అయిన రామ కృష్ణ,గౌరీప్రసాద్, సాయి వర్ధన్ లతో కలిసి అందుకున్నారు.. జిల్లా టీవీవీపీ ఆసుపత్రులు ఇప్పటికే పలు సందర్భాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు పొందగా, ఈ అవార్డులు గిరిజన ప్రజలకు అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలకు మరో గొప్ప గుర్తింపుగా నిలిచాయి.

# మహిళల భద్రతపై కట్టుదిట్టమైన చర్యలు

## - షీ టీమ్స్, ఏహెచ్‌టీయూ పనితీరును పరిశీలించిన ఎస్పీ రోహిత్ రాజు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఏప్రిల్ 7 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలోని షీ టీమ్స్, ఏహెచ్‌టీయూ కార్యాలయాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించి, మహిళలపై నేరాల నివారణకు మరింత సమర్థవంతంగా పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలోని షీ టీమ్స్ మరియు ఏహెచ్‌టీయూ కార్యాలయాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా కార్యాలయ పరిసరాలను పరిశీలించి, సిబ్బంది పనితీరును సమీక్షించారు. మహిళలపై లైంగిక వేధింపులు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, బ్లాక్‌మెయిలింగ్ వంటి సమస్యలు ఎదురైనప్పుడు బాధితులు జిల్లా షీ టీమ్స్‌ను నేరుగా సంప్రదించవచ్చని ఎస్పీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభాగమే షీ టీమ్స్ అని ఆయన వివరించారు. జిల్లా షీ టీమ్స్ ఫోన్ నంబర్ 8712682131కు కాల్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే నిందితుడిని పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వడం, అవసరమైతే కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. బాలికలు, మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా షీ టీమ్స్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రదేశాలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, కళాశాలల వద్ద షీ టీమ్స్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మానవ అక్రమ రవాణా, అవయవాల విక్రయం, వెట్టిచాకిరీ, వ్యభిచారం, బాల్య వివాహాలు వంటి నేరాలను అరికట్టేందుకు ఏహెచ్‌టీయూ సిబ్బంది కట్టుదిట్టంగా పనిచేయాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లాలో నిరంతరం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే, మఫ్టీ దుస్తుల్లో సిబ్బంది నేరాలకు అవకాశం ఉన్న ప్రదేశాలలో గస్తీ నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్, షీ టీం ఏఎస్సై నాగయ్య, సభ్యులు మల్లికాంబ, రాంబాబు పాల్గొన్నారు.



# ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యంపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ అంకిత్ పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 7 : ఏజెన్సీ ప్రాంతంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజలకు అందుబాటులో, నాణ్యమైన వైద్య సేవలు అందించడం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా భద్రాద్రి జిల్లా పాల్వంచ వైద్య ఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించడం ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతగా భావించాలన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టడం, మరింత బలోపేతం చేయడం అత్యంత అవసరమని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6 నుండి 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే ఈ జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో ఉన్న నమ్మకం విశేషమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రాష్ట్ర స్థాయి అవార్డులు స్వీకరించేందుకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతికి వెళ్లినట్లు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలో అమలు చేస్తున్న వైద్య కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, ఆరోగ్య పరిరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 43 మంది ఉద్యోగులకు కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దారా ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రసాద్ నాయక్, డాక్టర్ స్పందన, డాక్టర్ తేజస్వి, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు అనుసరించాలి

## - శాస్త్రవేత్త డా. ప్రశాంత్ కుమార్

## - మిరప దిగుబడి, నాణ్యత పెంపుపై రైతులకు అవగాహన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 7 : మిరప పంటలో దిగుబడి మరియు నాణ్యతను పెంచేందుకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను రైతులు అనుసరించాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మిరప తోటల సందర్శన కార్యక్రమం నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా మల్యాల ఉద్యాన పరిశోధన స్థానం హెడ్ డా. అడ్లూరి ప్రశాంత్ కుమార్, చిట్యాల మండలం గోపాలపురం గ్రామంలో సాగవుతున్న మిరప తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప కోత అనంతరం చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు విపులంగా అవగాహన కల్పించారు. పంట అవశేషాల సరైన నిర్వహణ, నేల ఆరోగ్య సంరక్షణ, ఎరువుల సమతుల్య వినియోగం, కీటక–వ్యాధి నియంత్రణ చర్యలు తీసుకోవడం ద్వారా దిగుబడి నాణ్యతను మెరుగుపరచవచ్చని వివరించారు. ఆధునిక సాగు పద్ధతులను అనుస రించడం ద్వారా ఖర్చులు తగ్గి, లాభాలు పెరుగుతాయని రైతులకు సూచించారు. అనంతరం జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయంలో కూరగాయల వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో మెరుగైన సాగు పద్ధతులు, పంటల ఎంపిక, నీటి నిర్వహణ, పంటల రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న మార్గదర్శ కాలను వివరించి, రైతులకు కూరగాయల మినీ విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేశారు. తోటల విస్తరణకు తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలపై కూడా సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఏ. సునీల్ కుమార్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి, ఉద్యాన అధికారి మణి, ఉద్యాన విస్తరణ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# సింగరేణి కార్మికుల ఆరోగ్య సంరక్షణే ప్రధాన లక్ష్యం

## - వేసవి జాగ్రత్తలపై మందమర్రి ఏరియా కెకే.5 గనిపై అవగాహన సదస్సు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మందమర్రి, ఏప్రిల్ 7 : ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్య సంరక్షణను ప్రధాన లక్ష్యంగా సింగరేణి సంస్థ పనిచేస్తోందని, అందులో భాగంగానే గనుల వద్ద వేసవి కాలానికి సంబంధించిన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య అధికారి డాక్టర్ పి.లోక్ నాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం మందమర్రి ఏరియాలోని కెకె–5 గనిపై ఉద్యోగులకు వేసవి జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సు ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (డీవై సీఎంఓ) మధుకుమార్, గార్ల మార్గదర్శకత్వంలో జరిగింది. ఈ సందర్భంగా వేసవి కాలంలో అనుసరించాల్సిన జాగ్రత్తలు, నీటి వినియోగం, శరీరానికి తగిన విశ్రాంతి, హీట్ స్ట్రోక్ నివారణ చర్యలు వంటి అంశాలపై ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గని సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఏ.రవళి, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మహిళ మృతికి కారణమైన డ్రైవర్‌కు జైలు శిక్ష

## ఏడాదిన్నర కారాగారం, రూ.5,000 జరిమానా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఏప్రిల్ 7: జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు భద్రాద్రి జిల్లా కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయి శ్రీ జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం, జూలూరుపాడు మండలం పడమటి నర్సాపురం గ్రామానికి చెందిన నాచబోయిన ప్రశాంత్ 2016 ఏప్రిల్ 22న జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన తల్లిదండ్రులు నాచబోయిన వెంకన్న, లలితలు 2016 ఏప్రిల్ 21 రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో, పాల్వంచకు చెందిన నందిగామ పవన్ కుమార్ తన మహీంద్రా కారు (టీఎస్ 04 ఈజే 999)ను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపిస్తూ ఇంటిలోకి దూసుకెళ్లాడని పేర్కొన్నారు. ఈ ఘటనలో నాచబోయిన లలితకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే ఘటనకు ముందు సుమారు 100 గజాల దూరంలో మాచినపేటకు చెందిన లాకావత్ సాయికుమార్, బోడా అశోక్ కుమార్ ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ (ఏపీ 24 ఏఎల్ 1262)ను ఢీకొట్టడంతో వారికి కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. ఫిర్యాదు మేరకు అప్పటి హెడ్ కానిస్టేబుల్ కే.రామదాస్ కేసు నమోదు చేయగా, సబ్ ఇన్స్పెక్టర్ పి. శ్రీనివాస్ దర్యాప్తు నిర్వహించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో 14 మంది సాక్షులను కోర్టు పరిశీలించింది. విచారణ అనంతరం నిందితుడు నందిగామ పవన్ కుమార్‌పై నేరం రుజువవడంతో న్యాయమూర్తి ఒక సంవత్సరం ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఏ.పీ.పీ. బి. విశ్వశాంతి వాదనలు వినిపించగా, కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్సై జి. రాఘవయ్య, కోర్టు డ్యూటీ సిబ్బంది పి.సి. పి.ఉపేందర్ రావు సహకరించారు.

# హత్యాయత్నం కేసులో నిందితునికి 5 సంవత్సరాల జైలు శిక్ష

## - రూ.5,500 జరిమానా విధించిన న్యాయస్థానం

## - జిల్లా పోలీసులను అభినందించిన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 7 : జిల్లాలోని ఘణపురం మండలం చెల్పూరు గ్రామంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితునికి భూపాలపల్లి అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి ఏ. నాగరాజు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం, చెల్పూరు గ్రామానికి చెందిన బమ్మ బిక్షపతి (50) బజ్జీల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2022 జనవరి 7న అదే గ్రామానికి చెందిన తాళ్లపెల్లి రాజు మద్యం మత్తులో బిక్షపతి దుకాణానికి వచ్చి చాప ముక్కలు ఇవ్వాలని అడిగాడు. డబ్బులు ఇవ్వాలని చెప్పడంతో ఆగ్రహానికి లోనైన నిందితుడు దుర్భాషలాడుతూ, చంపాలనే ఉద్దేశంతో మరిగుతున్న వేడి నూనెను ఫిర్యాదిదారిపై పోశాడు. ఈ ఘటనలో బిక్షపతికి కాళ్లపై తీవ్ర గాయాలు కాగా, ప్రాణ భయంతో అక్కడి నుంచి పారిపోయి అదే రోజు ఘణపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌హెచ్‌ఓ ఉదయ్ కిరణ్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో అదనపు పబ్లిక్ ప్రాసి క్యూటర్ ఎం.డి. రఫీక్ వాదనలు వినిపించగా, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ జి.వెంకన్న ఆధ్వ ర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్వేత సాక్షులను ప్రవేశపెట్టారు. విచారణలో నిందితునిపై నేరం రుజువవడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందించారు.

# ఆరోగ్యా నికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

## - క్యాన్సర్ పట్ల ప్రజలు ముందస్తు జాగ్రత్త వహించాలి

## - ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, ఏప్రిల్ 7 : ప్రతి ఒక్కరూ పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని కలిగి ఉండడానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని భద్రాద్రి జిల్లా ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలం సులానగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ముందస్తు క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ కార్యక్రమంలో మంగళవారం, ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళల్లో సోకే క్యాన్సర్ల లో రెండవ స్థానంలో ఉన్న గర్భాశయముఖ ద్వారా క్యాన్సర్ కి ప్రధాన కారణం అయిన హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్పీవీ)ని ఎదుర్కోవడానికి గాను 14 సంవత్సరాలు నిండి, 15 సంవత్సరాల లోపు బాలికలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సులానగర్ లో బాలికలకు వ్యాక్సిన్ అందజేయడం శుభ పరిణామం అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం రోజున ఈ వ్యాక్సిన్ ని టేకులపల్లి మండల లబ్ధిదారులైన బాలికలకు అందజేయడం ఆనందకరంగా ఉందని, అన్నీ భాగ్యాల కంటే ఆరోగ్యం మహాభాగ్యం అని పెద్దలు ఉత్తగనే చెప్పలేదని ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని కలిగి ఉండడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గర్భాశయముఖ ద్వార క్యాన్సర్ తో బాధపడుతున్న ఎంతో మంది మహిళల బాధల్ని స్వయంగా చూశానని, రోగం కంటే దాని చికిత్సకు ఇచ్చే కీమో రేడియేషన్ తెరఫి చికిత్స భరించలేని నొప్పి సైడ్ ఎఫెక్ట్స్ తో కూడి ఆర్థిక భారం తో కూడుకుని ఉంటాయని కాబట్టి చిన్నల నుండి పెద్దల వరకు ఆరోగ్యం మీద అవగాహన పెంచుకొవాలని ఏమాత్రం ఆరోగ్యం తేడా వచ్చినట్లు అనిపిస్తే వెంటనే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. బహిరంగ మార్కెట్లో ఖరీదైన ఈ వ్యాక్సిన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని, ప్రతి ఒక్క లబ్ధిదారులు (మహిళలు) దీనిని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వరి, కోరం సురేందర్, స్థానిక సర్పంచి పూల్ బంతి, చేతుల నాగేశ్వరరావు, స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్వేత, వైద్యులు కందుల దినేష్, కంచర్ల వెంకటేష్ ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జ పార్వతి, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్వైజర్లు రమేష్, గుజ్జ విజయ,కౌసల్య ,సింగ్ నాగుబండి వెంకటేశ్వర్లు ఫార్మసీ ఆఫీసర్ కిరణ్ కుమారి, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన రేషన్ షాపును ప్రారంభించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, ఏప్రిల్ 7 : భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండల పరిధిలోని బిల్లుడుతండా గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన రేషన్ షాపును ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం రిబ్బెన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదవాళ్లకు రేవంతన్న అండగా ఉంటూ తెలంగాణ ప్రజలకు మంచి పరిపాలన అందిస్తున్నారని అన్నారు. ప్రతీ పేదవాడు కూడా సన్న బియ్యం తినాలి అనే ఆలోచనతో రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. నేడు ఉన్నోడు, లేనోడు అనే తేడా లేకుండా పేద కుటుంబాలు సైతం సన్నబియ్యం అన్నం తినేలా, వారి మనస్సులో పేదవాళ్ళు అనే భావం లేకుండా సంతోషాన్ని నింపుతున్నారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# టేకులపల్లి మండలంలోని గిరిజన గ్రామంలో పోలీసుల గ్రామోత్సవం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేకులపల్లి, ఏప్రిల్ 7 : భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో ఇల్లెందు డిఎస్పీ వెంకన్న బాబు ఆధ్వర్యంలో టేకులపల్లి మండల పరిధిలోని చింతోని చెలక గ్రామపంచాయతీ గుత్తి కోయ గిరిజన గ్రామమైన నాగారంలో పోలీసులు మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో గ్రామానికి చెందిన మాధవి, కుంజ లక్ష్మి, సునీతలను సన్మానించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ, యువకులు మంచిగా చదువు కొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ, యువత చెడు మార్గాలలో వెళ్ళకూడదని కోరారు. గ్రామాలలో బాగా చదువుకొని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందిన వారిని ఆదర్శంగా చేసుకుని ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. అదేవిధంగా సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి టెన్నిస్ క్రీడాకారుల 'సింథటిక్' కల నెరవేరేనా?

## - సింగరేణి మేనేజ్‌మెంట్‌కు ఐఎన్‌టియుసి విన్నపం




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భూపాలపల్లి, ఏప్రిల్ 7 : స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలోని లాంగ్ టెన్నిస్ క్రీడాకారుల చిరకాల వాంఛ అయిన 'సింథటిక్ కోర్టు' ఏర్పాటుపై మరోసారి చర్చ మొదలైంది. ఈ మేరకు ఐఎన్టీయూసీ సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ప్రతినిధులు మంగళవారం భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డికి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. మట్టి కోర్టులో రాణిస్తున్నా..జాతీయ స్థాయిలో వెనుకబాటు. ప్రస్తుతం అంబేద్కర్ స్టేడియంలో కేవలం మట్టి కోర్టు (క్లే కోర్ట్) మాత్రమే అందుబాటులో ఉంది. మన క్రీడాకారులు ప్రతిరోజూ ఇక్కడే కఠినమైన ప్రాక్టీస్ చేస్తూ డివిజనల్, రీజనల్ మరియు కంపెనీ స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధిస్తూ సింగరేణి ప్రతిష్టను పెంచుతున్నారు. అయితే, సమస్య అంతా జాతీయ (కోల్ ఇండియా) స్థాయి పోటీల వద్దే వస్తోంది.

**సింథటిక్ కోర్టు ఎందుకు అవసరం?**

యూనియన్ ప్రతినిధులు తమ లేఖలో ప్రధానంగా ఒక విషయాన్ని నొక్కి చెప్పారు. జాతీయ స్థాయిలో నిర్వహించే కోల్ ఇండియా పోటీలు కేవలం సింథటిక్ కోర్టుల పైనే జరుగుతాయి. మట్టి కోర్టుపై ఆడి అలవాటున్న మన ఆటగాళ్లు, ఒక్కసారిగా సింథటిక్ కోర్టుపై ఆడేసరికి అక్కడి వేగాన్ని, బౌన్స్‌ను తట్టుకోలేక మెరుగైన ప్రతిభ ఉన్నప్పటికీ పతకాలు సాధించలేకపోతున్నారు.

**మేనేజ్‌మెంట్ నిర్ణయంపైనే క్రీడాకారుల ఆశలు**

సింగరేణి సంస్థ క్రీడలకు ఇచ్చే ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, వెంటనే అంబేద్కర్ స్టేడియంలో శాశ్వత ప్రాతిపదికన సింథటిక్ కోర్టును ఏర్పాటు చేయాలని ఐఎన్టియుసి భూపాలపల్లి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భేతెల్లి మధుకర్ రెడ్డి కోరారు. ఆధునిక వసతులు కల్పిస్తే సింగరేణి బిడ్డలు మరిన్ని జాతీయ స్థాయి బంగారు పతకాలను సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా మెమోరాండం సమర్పించిన బృందంలో ఏరియా స్ట్రక్చర్ కమిటీ మెంబర్లు బొడ్డు అశోక్, షేక్ హుస్సేన్ గార్లతో పాటు స్పోర్ట్స్ అసిస్టెంట్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్ తో పాటు క్రీడాకారులు శ్రీరాములు, చంద్రశేఖర్, రాజకుమార్, నాగేశ్వరరావు, సారంగపాణి, శ్రీకాంత్, కత్తెరసాల, రమేష్ పాల్గొన్నారు. ఈ విజ్ఞప్తిపై జనరల్ మేనేజర్ ఎలా స్పందిస్తారో, భూపాలపల్లి టెన్నిస్ క్రీడాకారుల కల ఎప్పుడు సాకారమవుతుందో వేచి చూడాలి.

# అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సూర్యాపేట, ఏప్రిల్ 7 : అడ్డదారుల్లో ధాన్యాన్ని తరలిస్తే ఉపేక్షించేది లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర సరిహద్దుల్లో ధాన్యం ఎగుమతులు, దిగుమతులపై కట్టుదిట్టమైన నిఘా ఉంచామని స్పష్టం చేశారు. ఈ రబీ సీజన్‌లో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉందని తెలిపారు. 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు తమ ప్రభుత్వం సన్నద్ధమైందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,251 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అందుబాటులో 16 కోట్ల గన్నీ బ్యాగులు ఉన్నాయని తెలిపారు. అంతకుముందు హుజూర్ నగర్ రామస్వామి గట్టు సమీపంలో ఐటీ కాలేజీతో పాటు మోడల్ కాలనీ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో 116 ఎకరాల్లో నిర్మిస్తున్న 2,160 సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల మోడల్ కాలనీ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తాయని చెప్పుకొచ్చారు. కాలనీ నిర్మాణానికి రూ.125 కోట్లు ఖర్చు, అదనంగా రూ.20 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. లబ్దిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ఎలాంటి పైరవీలకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. మొదటి విడతలో 1500 మంది లబ్దిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నెలాఖరులో మోడల్ కాలనీ ప్రారంభోత్సవం జరుగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజా ఉద్యమాలు బలోపేతం చేయాలి

## సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, ఏప్రిల్ 7 : ఇంటింటికి సిపిఐ పేరుతో ప్రతి ఇంటిని తట్టి, సమస్యలపై ప్రజలను కదిలించాలని ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ సత్తుపల్లి టౌన్ మండల కమిటీల సమావేశం మంగళవారం చాకలి ఐలమ్మ భవన్లో పాలకుర్తి వీరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కామ్రేడ్ దండి సురేష్ మాట్లాడుతూ. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు కారణంగా సామాన్య ప్రజలు బతకడం కష్టంగా మారిందని యుద్ధం పేరుతో ప్రజలపై భారాల మీద భారాలు వేస్తూ సామాన్యుల బ్రతకకుండా అవుతున్నారని విమర్శించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసి పేదలకు పొట్ట కొట్టేందుకు ప్రయత్నం చేస్తుందని పట్టణాల్లో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వారి సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నారని విమర్శించారు. దేశంలో పేదలు మరింత పేదలుగాను, ధనవంతులు మరింత ధనవంతులకు మారుతున్నారని, మోడీ విధానాల కారణంగా రైతులు కూలీలు కార్మికులు కష్టజీవులు దేశవ్యాప్త ప్రజానీకం ఇబ్బందుల్లో కూరుకు పోయారని ఆయన విమర్శించారు. అదేవిధంగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి ప్రజలకు మరింత చేరువు కావాల్సిన అవసరం ఉందని ప్రజలకు ఇచ్చిన హామీలు త్వరితగతి నా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు సింగ్ నరసింహారావు మాట్లాడుతూ, దేశంలో రాష్ట్రంలో కమ్యూనిస్టులు అవసరం పెరిగిందని, ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే కమ్యూనిస్టులు అక్కడ ఉంటారని కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ, సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో పట్టణంలో ఇళ్ల స్థలాలు లేని పేదలు అనేకమంది ఉన్నారని వారందరికీ పాటు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, శిఖం భూములు పేదలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, మండల కమిటీ సభ్యులు దండు జగన్, రామారావు, కోలేటి వెంకటేశ్వరరావు, నాగరాజు, ఎస్.కె కాసింబి, ఎస్.కె జాన్బి, సునీల్, గిరి, తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ కాలవలో ప్రాణాపాయంలో గోమాత...

## ప్రాణాలకు తెగించి కాపాడిన రాణా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, ఏప్రిల్ 7 : మానవత్వం ఇంకా సజీవంగా ఉందనే నిదర్శనంగా నిలిచే ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండల పరిధిలోని రఘునాథ బంజర గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. సాగర్ కాలవలో ప్రమాదవశాత్తు పడిపోయి ప్రాణాపాయంలో కొట్టుమిట్టాడుతున్న గోమాతను ప్రాణాలకు తెగించి కాపాడిన సర్పంచ్ భర్త రాణా ధైర్యసాహసం స్థానికులను కట్టిపడేసింది. వివరాల్లోకి వెళితే...కాలవలో చిక్కుకుని బయటపడలేక అలమటిస్తున్న గోమాతను గమనించిన రఘునాథ గూడెం గ్రామ సర్పంచ్ కుక్కా సుధారాణి భర్త రానా క్షణం ఆలస్యం చేయకుండా స్పందించాడు. పరిస్థితి తీవ్రతను అంచనా వేసిన ఆయన వెంటనే కాలవలోకి దూకి గోమాతను రక్షించే ప్రయత్నం ప్రారంభించాడు. అయితే భయంతో వణికిపోయిన గోవు దగ్గరకు రానీయకపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర కాలవలో ఈదుకుంటూ వెంబడించాల్సి వచ్చింది. ఇరువైపులా సైడ్ వాల్స్ ఉండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారినా,తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రాణా పోరాటం కొనసాగించాడు. చివరికి కొంత వెసులుబాటు ఉన్న ప్రదేశానికి చేరుకున్న తర్వాత స్థానికుల సహకారంతో తాళ్లను ఉపయోగించి గోమాతను సురక్షితంగా ఒడ్డుకు లాగారు. ఈ క్రమంలో గోవు భయంతో వెనుక కాళ్లతో తన్నినా, రాణా ఏమాత్రం వెనుకడుగు వేయకుండా తన ధైర్యాన్ని చాటుకున్నాడు. ప్రాణాపాయంలో ఉన్న మూగజీవాన్ని కాపాడిన రాణా ధైర్యసాహసం గ్రామంలో ప్రశంసల వర్షం కురిపిస్తోంది. గ్రామ అభ్యున్నతికి కృషి చేయడమే కాకుండా,కరుణా హృదయంతో గోమాత ప్రాణాలు రక్షించిన ఆయనను స్థానికులు, ప్రయాణికులు ఘనంగా అభినందించారు. ఈ రక్షణ కార్యక్రమంలో కుక్కా లాలు,పోతురాజు రాము,అంజారావు,రావుల సీతయ్య, బండి వెంకయ్య,నల్లగొర్ల నాగేశ్వరరావు,కుక్క శ్రీనివాసరావు, కొలికపోగు కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.





# ఆసుపత్రుల నిర్వహణ నిబంధనలకు విరుద్ధంగా ఉండవద్దు

## - విద్యార్థులకు, వంట సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలి

## - సాంఘిక సంక్షేమ పాఠశాల, అప్పర్ ప్రైమర్ హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను

## - ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 07 : జిల్లాలోని తొర్రూరు పట్టణ కేంద్రంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికల)ప్రీ మెట్రిక్ , పోస్ట్ మెట్రిక్ అప్పర్ ప్రైమర్ హాస్పిటల్, హెల్త్ సెంటర్ లను మంగళవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు, కలెక్టర్ పాఠశాలలో తరగతి గదులు, డార్మెంటరీ, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, టాయిలెట్స్,పరిసరాలను పరిశీలించి విద్యార్థిని, విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. డైట్ మెనూ ను కచ్చితంగా అమలు చేయాలని,నాణ్యమైన వేడివేడి ఆహార పదార్థాలను అందించాలని,భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు వహిస్తూ భోజనం, టిఫిన్స్, స్నాక్స్ సిద్ధం చేయాలన్నారు.విద్యార్థులకు,వంట సిబ్బందికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించి అట్టి నివేదికలను సమర్పించాలని సంబంధిత వార్డెన్, ప్రిన్సిపల్ ను ఆదేశించారు.ప్రత్యేక అధికారులు సందర్శన సమయం లో విదర్థులతో కలిసి భోజనం చేయాలని సూచించారు.ప్రతి విద్యా సంస్థ వసతి గృహాలలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలని అందుకు సంబంధిత శాఖ ప్రధాన అధికారి లేదా ప్రత్యేక అధికారి వద్దనే ఉండాలని, భోజనం, సౌకర్యం తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.ప్రస్తుత వేసవికాలం నేపథ్యంలో విద్యార్థిని విద్యార్థులకు అన్ని ఏర్పాట్లను,సౌకర్యాలను కల్పించాలని తగినన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. హెల్త్,ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ ,సానిటేషన్ లపై పిల్లలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అప్పర్ ప్రైమర్ హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ ను సందర్శించి ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.మందుల స్టాక్ రిజిస్టర్, తదితర రికార్డులను తనిఖీ చేశారు, హాస్పిటల్ పరిధిలోని సబ్ సెంటర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా మెరుగైన వైద్యం ప్రతి ఒక్కరికి అందించాలని సూచించారు.వైద్యం కోసం వచ్చే వారికి సేవలు అందించడం కోసం డాక్టర్స్ నిత్యం అందుబాటులో ఉండాలని, వేసవి ప్రభావం నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని,అవసరం ఉన్నచోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని మాత, శిశు మరణాలను జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.అక్రమ స్కానింగ్ లు, లింగ నిర్ధారణ పరీక్షలు నిబంధనలకు విరుద్ధంగా నడిచే ప్రయివేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరికి ధైర్యం భరోసా కల్పించాలని తమ పరిధిలో ఉన్నటువంటి సేవలను వేగంగా అందించాలని సూచించారు.ఆశా కార్యకర్తలతో మాట్లాడుతూ వార్డు గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ ను మెయింటైన్ చేయాలని, గర్భిణీ స్త్రీలను, చిన్న పిల్లలను ఇతర వ్యాధిగ్రస్తులను గమనిస్తూ ఉండాలని, సూచించారు.కలెక్టర్ వెంట తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, సాంఘిక సంక్షేమ శాఖ డిసిఓ జయశ్రీ, ప్రిన్సిపల్ రత్నమాల, హాస్పిటల్ డాక్టర్స్ సుగుణాకర్ రాజు, నందన దేవి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు.




# 'త్రివేణి'లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 7 : త్రివేణి ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ.. ఆహారపు అలవాట్లు వాటి పర్యా వసానాలు గురించి వివరించారు. పిల్లలు అంతా జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలని, మనం తీసుకునే కూరగాయలు, పండ్లు కడిగి వాడుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జంక్ ఫుడ్ కు దూరంగా ఉంటూ ఇంటి భోజనాన్ని తీసుకోవాలని తెలిపారు.

# పాక్‌లో తీవ్ర ఇంధన కొరత

## లాక్‌డౌన్ తరహా ఆంక్షలు విధింపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఇస్లామాబాద్,ఏప్రిల్7 : హోర్ముజ్ జలసంధి మీదుగా ముడి చమురు, సహజవాయువు రవాణా నౌకల రాకపోకలపై ఇరాన్ ఆంక్షలు విధించిన నేపథ్యంలో ప్రపంచాన్ని ఇంధన సంక్షోభం భయపెడుతోంది. ఇంధన కొరత ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌లో ప్రభుత్వం తాజాగా లాక్‌డౌన్ తరహా ఆంక్షలకు తెరతీసింది. వాణిజ్య కార్యకలాపాలపై పరిమితులను ప్రకటించింది. విద్యుత్, ఇంధన పొదుపు చర్యలపై సమావేశం నిర్వహించిన అనంతరం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ ఆంక్షలను ప్రకటించారు. రేడియో పాకిస్థాన్ ప్రసారం చేసిన వివరాల ప్రకారం, ఇకపై దేశవ్యాప్తంగా పాక్‌లో మార్కెట్స్, షాపింగ్ మాల్స్, ఇతర వాణిజ్య సముదాయాలను రాత్రి 8 గంటల కల్లా మూసివేయాల్సి ఉంటుంది. అయితే, డివిజనల్ హెడ్‌క్వార్టర్స్‌కు మాత్రం ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించింది. ఆయా ప్రాంతాల్లో రాత్రి 9 గంటల వరకూ కార్యకలాపాలు కొనసాగించేందుకు అనుమతించింది. ఇక బేకరీలు, ఫుడ్ స్టాల్స్ వంటివి కూడా రాత్రి 10 గంటల కల్లా మూసేయాల్సి ఉంటుంది. ప్రజల ఇళ్లల్లో రాత్రి 10 గంటల తరువాత పెళ్లిళ్లకు సంబంధించి కార్యక్రమాలు ఏవీ నిర్వహించకూడదు. అయితే, ఫార్మసీలు, ఇతర హెల్త్ కేర్ సర్వీసెస్‌కు సంబంధించిన షాపులకు మాత్రం ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.

# ఆటోల ఎల్పీజీకి కొరత రాకూడదు

## - ఎల్పీజి సరఫరా కంపెనీతో కమిషనర్ సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్7 : ఆటో ఎల్పీజీ తెప్పించి బంకుల్లో ఎక్కడా కొరత లేకుండా చూడాలని కంపెనీలకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గత వారం రోజులుగా కంపెనీలు మంచి పనితీరు కనబరిచాయని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆటో ఎల్పీజీ సరఫరా చేసే ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలతో కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వారం రోజుల్లో మొత్తం 363 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీని తెప్పించి సరఫరా చేశారని వివరించారు. మూతపడిన 17 బంకులను మళ్లీ తెరిపించారని పేర్కొన్నారు. గ్యాస్ సరఫరాను పెంచి, మూతపడిన బంకులను మళ్లీ తెరిపించడంలో సూపర్ గ్యాస్ (ఈూబూ।స ఉజీబ), గో గ్యాస్ (ఉనీ ఉజీబ), టోటల్ ఎనర్జీస్ (ఈనీబిజీ ఇని।సణతి।బ), ప్రైమ్ ఫ్యూయల్ (ఖసతిప। ఈబీ।) కంపెనీలు చేసిన కృషిని ఈ సందర్భంగా కమిషనర్ అభినందనలు తెలిపారు. పని తీరు ఏ మాత్రం మెరుగు పరుచుకోని పలు కంపెనీల పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటో ఎల్పీజీని అధికంగా తెప్పించి, బంకులన్నింటిలో సరఫరా చేయాలని కంపెనీలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతినకుండా ఉండాలంటే ఆటో ఎల్పీజీ సరఫరా ఆగకుండా చూడాలని ఆయిల్ కంపెనీలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆటో గ్యాస్ కొరత రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామన్నారు. బంకులకు గ్యాస్ వస్తున్న లెక్కలను పౌరసరఫరాల శాఖ ప్రతి రోజు పర్యవేక్షిస్తుందని కమిషనర్ స్టీఫెన్ రవీందర్ వెల్లడించారు. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్ లైన్ 1967కు ఫోన్ చేయాలని సూచించారు.

# రైతులను పరామర్శించకుండా అడ్డుకుంటారా

మొదటిపేజీ తరువాయి

ఈ ప్రభుత్వం అక్రమంగా రైతుల భూముల చెరబడుతున్నదని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. రెండున్నరేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ వచ్చింది లేదు .. ఒక్క ఇటుక పేర్చింది లేదని విమర్శించారు. కానీ భూసేకరణ పేరుతో రైతులను భయభ్రాంతులకు గురిచేస్తుం దని మండిపడ్డారు. తమ భూముల కోసం పోరాడుతున్న రైతులకు భరోసా ఇవ్వడం ప్రతిపక్షంగా బీఆర్ఎస్ బాధ్యత అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ నిర్బంధం సిగ్గు చేటు అని విమర్శించారు. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు .. కాంగ్రెస్ నేతలు భూములను దోచుకుంటున్నారని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం ఎంత అణచివేసినా ప్రజలు, రైతుల తరపున ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. బాధిత రైతులను కలిసేందుకు వెళ్లకుండా హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతలపై ఆంక్షలు, హౌస్ అరెస్టులపై మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకింత భయం అని ప్రశ్నించారు. అక్రమంగా పేదల భూములను గుంజుకుంటున్న ప్రభుత్వం.. బాధితులను కలవడానికి వెళ్తుంటే ఇన్ని నిర్బంధాలా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుడుతుందని ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. రైతుల పక్షాన పోరాటం చేస్తే అక్రమ అరెస్టులా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మాటలకు, చేతలకు పొందన లేదని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న హరీశ్‌రావు అంటే ఎందుకంత భయమని ప్రశ్నించారు. ఇది ప్రజాపాలన కాదు.. ప్రజల పాలిట శాపంగా మారుతున్న పాలన అని ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా మీ అవినీతిని బయటపెడుతూనే ఉంటామని హెచ్చరించారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఐపీఎల్ పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం కఠిన చర్యలు తీసుకుంటుందని సీపీ తెలిపారు. ఇప్పటివరకు 494 పెయిడ్ యాడ్స్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు బ్లాక్ చేశారని సీపీ చెప్పారు. సోషల్ మీడియాలో 129 ఫేక్ ప్రొ÷ళ్లైను తొలగించారన్నారు. బెట్టింగ్ యాప్‌లపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. మోసపూరిత యాడ్స్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయాలని ప్రజలను సీపీ కోరారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కి ఫోన్ చేయాలని లేదా ఞాశి।సఞసతిప।.ఙనీల.తిని వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

## పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్7: తెలుగు రాష్ట్రల్లో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తాజా వివరాల ప్రకారం.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మేఘావృత వాతావరణంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఇక తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, సూర్యపేట, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదని సూచించారు. రైతులు, ప్రయాణికులు సైతం వాతావరణ పరిస్థితులను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాల మీద ఎకువగా పడుతుంటాయి. కాబట్టి వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఒక్కోసారి పిడుగు పడ్డ ప్రదేశంలోనే మరోసారి పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ ప్రాంతానికి వెళ్లకూడదు. వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోర్డులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకోక పోవడం చాలా మంచిది. పశువులను గుడిసెలు, కొట్టాలు, షెడ్లలో కట్టివేయాలి. చెట్ల కింద ఉంచొద్దు. ఉరుములు, మెరుపులతో వర్షం పడినప్పుడు రైతులు పొలాల వద్ద ఉండకూడదు.

# ఇరాన్ నాగరికత అంతమై పోవడం ఖాయం

## - ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
## - హర్మ్యాజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
## - మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వాషింగ్టన్,ఏప్రిల్7 : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు.

అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మ్యాజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్ లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

# యూరియా యాప్ పై హర్షం వ్యక్తం చేసిన రైతులు

మొదటిపేజీ తరువాయి

యాప్ తో లైన్లలో నిలబడే బాధ తప్పిందని, ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకోని, ఉచిత సమయంలో తెచ్చుకునేందుకు వీలు కలిగిందని, దీంతో సమయం వృథా కాకుండా ఉందని రైతులు యూరియా యాప్ ని కొనియాడారు. భవిష్యత్తులో కూడా యూరియా యాప్ తోనే యూరియా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని రైతులు కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని, రైతుల అభిప్రాయాల మేరకే ఈ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రిగారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధిక యూరియా వాడకం ద్వారా వచ్చే అనర్థాలను రైతులకు మంత్రి వివరించారు. రైతులు తాము పండించే అన్ని పంటలలో పామాయిల్ పంటను కూడా వేయవచ్చని, పామాయిల్ పంటను వేసి కూడా వరి, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలు పండించుకోవచ్చని రైతులకు వివరించారు. రైతులందరు పామాయిల్ పంటను వేసినట్లయితే స్థిరమైన అధిక ఆదాయం పొందే వీలుంటుందని అన్నారు. సచివాలయంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు, సర్పంచ్ లు వ్యవసాయంశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రతిపాదించిన డంపింగ్ యార్డు పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్ పాల్గొన్నారు.

# తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి పరుగులు తీస్తోంది. తెలంగాణలో మావోయిజం పూర్తిగా అంతరించిందని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. 'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితులను వివరించారు. ఒకప్పుడు దట్టమైన అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ఉనికి ఇప్పుడు తెలంగాణలో లేదని డీజీపీ స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడంతో పాటు, కీలక నాయకత్వం , సైన్యాధ్యక్షులు సైతం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అయిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతాలు నక్సల్ రహిత జోన్లుగా మారాయని, ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారని తెలిపారు. గతంలో కనీస సౌకర్యాలు లేకపోవడమే నక్సలిజం పెరగడానికి ప్రధాన కారణమని గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ లోటును భర్తీ చేస్తోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని కర్రెగుట్టల వంటి ప్రాంతాలకు ఇప్పుడు బిటి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఆదివాసీలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లడానికి గ్రామస్తుల కోసం ప్రభుత్వం ఒక ఆటో , టూ వీలర్‌ను కమ్యూనిటీ వాహనాలుగా అందజేసింది. గతంలో 12-13 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి ఇప్పుడు తొలగిపోయింది. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ఇళ్లకు సోలార్ కందిళ్లను పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం చీకట్లను తొలగిస్తోంది. కనీసం ఆధార్ కార్డులు, ఓటు హక్కు వంటి కనీస గుర్తింపు కూడా లేని ఆదివాసీలకు ఇప్పుడు అన్ని ప్రభుత్వ ఫలాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ బాస్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, అటవీ వనరులను కాపాడుకుంటూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని డీజీపీ భరోసా ఇచ్చారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా, అభివృద్ధి ద్వారానే మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోంది. కర్రెగుట్టల వంటి ప్రాంతాల్లో వేసిన రోడ్లు కేవలం రవాణా కోసమే కాదు, ఆ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వేసిన బాటలు అని చెప్పవచ్చున్నారు.

# ఆరు గ్యారెంటీలు 900 రోజులైనా ఏవీ

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అరెస్టు చేశారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాలన.. గడీల పాలన.. బేడీల పాలన.. గుడ్డి పాలన అంటూ హరీశ్ రావు అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టండంటూ ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్నా భూములను ఎందుకు లాక్కుంటున్నారంటూ ప్రభుత్వాన్ని సూటిగా ఆయన ప్రశ్నించారు. మీ పాలన అంతా బోగస్ మాటలు.. బోగస్ పాలన అంటూ రేవంత్ పరిపాలనను ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా? అని ఈ సందర్భంగా హరీశ్ రావు ప్రశ్నించారు. రామరాజ్యం వస్తుంది.. కేసీఆర్ రాజ్యం వస్తుందని ఈ సందర్భంగా హరీశ్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. పరిగిలో రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్తన్న హరీశ్ రావుతో ఆయన అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాంతో హరీశ్ రావు పైవిధంగా స్పందించారు. పోలీసు నిర్బంధాలు, అణిచివేత చర్యల మధ్య వికారాబాద్ జిల్లా పరిగి రైతుల వద్దకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు బయల్దేరారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, దివాకర్ రావు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల దయాకర్‌రావుతో కలిసి ఆయన పరిగికి బయల్దేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో అప్పా జంక్షన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. పరిగికి చేరుకోకుండా హరీశ్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. హరీశ్‌రావు కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా లారీలను రోడ్డుకు అడ్డంగా పెట్టారు. రైతులకు భరోసాగా వెళ్తున్న హరీశ్‌రావును అరెస్టు చేసేందుకు యత్నించారు. అయితే పోలీసుల తీరును బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించిన ఆందోళన చేపట్టారు. దీంతో అప్పా జంక్షన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. అప్పా జంక్షన్ వద్ద అడ్డుకుని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావును స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి పాలన రాక్షస పాలనగా మారిందని విమర్శించారు. పరిగిలో అన్యాయానికి గురైన రైతులకు భరోసా ఇవ్వడానికి వెళ్తున్న మమ్మల్ని అడ్డుకొని, అన్యాయంగా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడికక్కడ దళిత, గిరిజన, బలహీనుల భూములు లాక్కుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తుందని అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను పలకరించడానికి కూడా వెళ్లనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# ఎసిబికి చిక్కిన అగ్రి వర్సిటీ అసోసియేట్ డీన్

హైదరాబాద్,ఏప్రిల్7 : ఎన్ని దాడులు జరుగుతున్నా లంచావతారాలు మారడం లేదు. నిత్యం ఎక్కడో చోట లంచగొండులు పట్టుబడుతూనే ఉన్నారు. ఆచార్య జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ అసోసియేట్ డీన్ గోవర్ధన్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఒక విత్తన కంపెనీ నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఈ క్రమంలో రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ కళాశాలతో పాటు, ఎల్బీనగర్‌లోని గోవర్ధన్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

# ఐటీ కారిడార్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

మొదటిపేజీ తరువాయి

కాపాడిన ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ. 12 వందల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు అధికారులు. ఖానామెట్ లోని సర్వే నంబర్ 55లో ఉన్న ప్రభుత్వ భూమిలో భారీ ఆపరేషన్ చేపట్టారు హైడ్రా అధికారులు. ఈ స్థలంలో తాత్కాలిక షెడ్లు, నిర్మాణాలు తొలగించారు హైడ్రా అధికారులు. హైడ్రా వార్నింగ్ తో ఆర్‌సీసీ ప్లాంట్‌ను స్వయంగా తొలగించింది ప్రభుత్వ భూమిని ఆక్రమించిన నిర్మాణ సంస్థ. ప్రభుత్వ భూమిలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించిన హైడ్రా.. మొత్తం భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేసి..అసైన్డ్ ల్యాండ్‌గా గుర్తించి, ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో నమోదు చేసినట్లు తెలిపారు అధికారులు. రియల్ ఎస్టేట్ సంస్థల తప్పుడు ÷-లకెయిమ్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు అధికారులు.

# రైతుల భూములు లాక్కునే యత్నం దుర్మార్గం

మొదటిపేజీ తరువాయి

విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని, ఉద్యమ కాలం నుంచే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడినా, బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అక్రమంగా నిర్బంధించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని టీ పీసీసీ చీఫ్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలకు టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చుస్తుందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయన్, మోడీ మంచి మిత్రులు

మొదటిపేజీ తరువాయి

మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమన్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని.. కానీ ఆయన ప్రభుత్వం అంటే తనకు నచ్చదన్నారు. ఊమెన్ చాండీ కరుణాకరన్ ఆధ్వర్యంలో కేరళ అభివృద్ధి చెందిందన్నారు. కేరళంకు పినరయి విజయన్, మోడీలు వద్దు. పినరయి విజయన్ జ్యోతి బసు, సోమనాథ్ చటర్జీలను మరచిపోయి చాలా కాలం అయ్యింది. ఎన్డీఏ తరపున పినరయి విజయన్ కేరళంలో పని చేస్తున్నారు. కేరళంలో ప్రతి సమస్యకు కారణం పినరయి విజయన్. గత పదేళ్లుగా పినరయి విజయన్ కాకుండా మరో వామపక్ష నేత లీడర్‌గా లేరు. 2023కు ముందు తెలంగాణను తాను తప్ప ఎవరు నడిపించ లేరు అని పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ అనుకున్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి తెలంగాణలో అభివృద్ధి చేస్తోంది. కేరళంలో యూడీఎఫ్ వచ్చి పినరయి విజయన్ కోటను బద్దలు కొడుతుంది. మోడీ పినరయి విజయన్ పేరుతో కేరళంలోకి ఎంటర్ అవుతున్నారు. మోడీ, పినరయి విజయన్ ఇద్దరూ బ్రదర్స్. కేరళంలో పినరయి, ఢిల్లీలో మోడీ మంచి మిత్రులని సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు.






# మహిళ అభివృద్ధి - దేశాభివృద్ధి : జిల్లా కలెక్టర్ కె. హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 7: మహిళల సంక్షేమం, అభివృద్ధితో దేశాభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా మహిళ– శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భేటీ జన్మోత్సవ్ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి , సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భేటీ బచావో – భేటీ పడావో కార్యక్రమం ద్వారా ఆడపిల్లలను కాపాడుకుందాం, చదివించుకుందాం, ఎదగనిద్దాం నినాదంతో ఆడపిల్లల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. లింగ వివక్ష లేకుండా పురుషులతో సమానంగా మహిళలకు అన్ని రంగాలలో ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుందని, మహిళల ఆర్థిక అభివృద్ధి కొరకు అనేక పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందించి వ్యాపార రంగాలలో రాణించేందుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఆడపిల్ల పుడితే సంతోషంగా వేడుక జరుపుకోవాలని తెలిపారు. మహిళల ఆరోగ్యం దృష్ట్యా స్వయం సహాయక సంఘాల మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధితో కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం భేటీ జన్మోత్సవ్ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు కావలసిన 12 రకాల వస్తువులతో కూడిన 10 బేబీ కిట్లను అందజేశారు. అంగన్వాడి టీచర్లకు విధుల నిమిత్తం 871 4జి మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి, ఎసిడిపిఓలు, సూపర్ వైజర్లు, అంగన్వాడి టీచర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి - కొత్వాల

## - 46వ డివిజన్ లో విస్తృతంగా పర్యటించిన కొత్వాల, కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 7: ప్రజలు తమ నివాస ప్రాంతాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలనీ రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం భద్రాద్రి జిల్లా పట్టణ పరిధిలోని పాత పాల్వంచ 46వ డివిజన్ గడియకట్టలో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి తోకలిసి కొత్వాల విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ లలో అధికారులు మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. నివాస ప్రాంతాల్లో డ్రైన్లు, రోడ్లు నిర్మించాలని, మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ రాము, సిబ్బంది యూసుబ్, త్రిదేవ్, గడియకట్ట వాసులు దేశబోయిన వెంకటేశ్వర్లు, అగ్నిమండలం భాస్కర్, మసనం శరత్, కోసూరి కిరణ్, వంగా రమేష్, బూసి శ్రీను, యాటా నాని, బర్ల అన్వేష్, ధర్మరాజుల రమేష్, మెడికల్ నాని, తదితరులు పాల్గొన్నారు.






# మారుమూల ప్రాంతాలలో సైతం మెరుగైన ఆరోగ్య వైద్య సేవలు : జిల్లా కలెక్టర్ కె.హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 7 : జిల్లాలోని మారుమూల ప్రాంతాలలో సైతం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. సుబోధ్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, పట్టణ దవాఖానాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజా సంక్షేమం కోసం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణంలో చేపట్టిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి సెప్టెంబర్ నెలలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాల వయసు గల పిల్లలకు హెచ్ పి వి టీకా అందించడం జరుగుతుందని, నవజాత శిశువు నుండి పిల్లలకు సకాలంలో టీకాలు అందించి వారి ఆరోగ్యం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సరైన పోషక ఆహారాలు అందించి పిల్లల ఎదుగుదలకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తల ప్రజలకు పారిశుధ్యం పై అవగాహన కల్పించి వారి ఆరోగ్య దృష్ట్యా పాటించవలసిన జాగ్రత్తలను వివరించడం జరుగుతుందని తెలిపారు. వైద్యవృత్తి సవాళ్లతో కూడుకుందని, వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. వైద్య రంగంలో వివిధ విభాగాలలో పని చేస్తున్న సిబ్బంది సమన్వయంతో ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో పొరుగు సేవలు, ఒప్పంద పద్ధతిన ప్రొఫెసర్లను తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు దయాలసిస్ సేవలు అందించేందుకు తగిన పరికరాలు, సిబ్బంది సమకూర్చడం జరిగిందని తెలిపారు. ఆసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది గ్రామస్థాయిలో సేవలు అందించాలని తెలిపారు. జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని, గిరిజన గ్రామాలలో వైద్య సేవలను అందుబాటులో ఉంచే విధంగా కార్యాచరణ అమలు చేయాలని, పిల్లలు, ప్రజలు సకాలంలో తీసుకోవలసిన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఇప్ప పువ్వు లడ్డు, అంతర పంటలను సాగు చేసి పోషక విలువలు కలిగిన పంట ఉత్పత్తులను అందుబాటులో ఉంచేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటుచేసి సేవలు అందించడం జరుగుతుందని, కుటుంబ నియంత్రణపై మారుమూల ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసేందుకు ప్రత్యేక వైద్య నిపుణులు నియమించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం - ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలి

## - రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల

## - ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హెల్త్ రన్‌లో పాల్గొన్న కొత్వాల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




భద్రాద్రి–కొత్తగూడెం, ఏప్రిల్ 7 : సుఖమయ జీవనం కోసం ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా యశోదా హాస్పిటల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ల సహకారంతో నెక్సస్ – 26 హెల్త్ రన్ కార్యక్రమం నిర్వహించారు. కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి నుండి ప్రకాశం స్టేడియం వరకు జరిగిన హెల్త్ రన్ లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారిలతో పాటు లికొత్వాల, సిపిఐ కార్యదర్శి సాబీర్ పాషా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ, నిత్యం వ్యాయామం, వాకింగ్, రన్నింగ్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలని అన్నారు. వైద్యులు దేవులతో సమానమని, కరోనా వంటి విపత్కర స్థితులలో వైద్యులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వేలాది మంది ప్రాణాలు కాపాడారని కొత్వాల అన్నారు. రైల్వే బోర్డు మెంబెర్ వై.శ్రీనివాసరెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యుగంధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు, వైద్యులు, పోలీస్ శాఖా, యశోదా హాస్పిటల్స్ వైద్యులు, ప్రభుత్వ వైద్య కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 7 : జిల్లాలో ఈ నెల 20వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా విద్యాధికారి లలిత, పరీక్షల సహాయ కమిషనర్ జనార్ధన్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈనెల 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరగనున్న ఎస్ ఎస్ సి పరీక్షలకు హాజరయ్యే 643 మంది విద్యార్థుల కొరకు 3 పరీక్ష కేంద్రాలు, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే 360 మంది విద్యార్థుల కొరకు 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా





ఆర్ టి సి అధికారులు బస్సులు నడిపించాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలో అత్యవసర వైద్య సేవలు నిమిత్తం వైద్య సిబ్బంది, మందులు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుండి మే 5వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ థియరీ, ప్రాక్టికల్ నిర్వహణ కొరకు తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో త్రాగునీరు, పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలో పరీక్షలు సజావుగా సాగేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలి

## - భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 7 : యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని శారీర కంగా మానసికంగా దృఢంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నారు .జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న సి.సి.పి.ఎల్ సీజన్–4 క్రికెట్ పోటీలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్ తో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని శారీరకంగా, మానసికంగా దృఢంగా మారాలని సూచించారు.క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకా రులు వెలుగులోకి వస్తారని అన్నారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, యువత తమ ప్రతిభను ప్రదర్శించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి గుమ్మడి శ్రీదేవి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడాకారులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి సమస్య రావొద్దు

## వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, ఏప్రిల్, 7 : వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో అమృత్ 2.0 పథకంలో జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ స్వయంగా పట్టణంలో పర్యటించి, పబ్లిక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో అమృత్ పథకంలో చేపట్టిన పనులను పరిశీలించారు. ముందుగా మర్రికుంట పాల కేంద్రం వెనుక నిర్మాణంలో ఉన్న నీటి ట్యాంకును సందర్శించి, పట్టణంలో ప్రస్తుతం ఉన్న నీటి ట్యాంకుల సంఖ్య, వాటి సామర్థ్యం పై అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ డి.ఈ. వివరాలు అందిస్తూ, వనపర్తి పట్టణంలో ప్రస్తుతం 6.5 ఎంఎల్డీ సామర్థ్యంతో 30 నీటి ట్యాంకులు ఉన్నాయని తెలిపారు. పట్టణ అవసరాలకు అనుగుణంగా ఇంకా 5.5 ఎంఎల్డీ అదనపు సామర్థ్యం అవసరమని పేర్కొన్నారు. అమృత్ పథకంలో భాగంగా 8 కొత్త ట్యాంకులు మంజూరయ్యాయని, అందులో 5 ట్యాంకుల పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని వెల్లడించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, ట్యాంకుల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, అలాగే మున్సిపాలిటీ పరిధిలో అమృత్ 2.0 కింద చేపట్టిన అన్ని పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

**పెద్దగూడెం డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సందర్శన**

వనపర్తి మండలం పెద్దగూడెం శివారులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీని కలెక్టర్ సందర్శించారు. కాలనీలో పబ్లిక్ హెల్త్ విభాగం చేపట్టిన సీసీ రోడ్ల పనులను తనిఖీ చేసి, మౌలిక వసతుల అభివృద్ధిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాలనీలో నివసిస్తున్న లబ్ధిదారుల పరిస్థితిని తెలుసుకోవాలని, ఇళ్లలో అసలు లబ్ధిదారులే ఉంటున్నారో లేదో తనిఖీ చేయాలని తహసిల్దార్‌కు సూచించారు. ఇక కాలనీవాసులు తాగునీరు, ఇతర సౌకర్యాల కొరతపై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ డి.ఈ. శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్ సైట్ ఎఫ్ఐఆర్ ద్వారా సులభంగా పోలీస్ సేవలు : ఎస్పీ నితికా పంత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, ఏప్రిల్ 7: జిల్లాలో ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా పోలీస్ సేవలను అందించేందుకు ఆన్ సైట్ ఎఫ్ఐఆర్ Onsite FIR (Door step FIR) విధానాన్ని అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ హత్యాయత్నం, అత్యాచార యత్నం, దోపిడీ ,చోరీ, మహిళలు, చిన్నారులపై నేరాలు, తీవ్రస్థాయి రోడ్డు ప్రమాదాలు, పోక్సో కేసులు, ఎస్సీ ఎస్టీ కేసులు, బాల్యవివాహాలు, ర్యాగింగ్ వంటి ఘటనల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, వారు ఉన్న ప్రదేశానికే వెళ్లి పోలీసు అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని చెప్పారు. సంఘటన స్థలంలోనే కేసు నమోదు చేయడం వల్ల ఆధారాలు వేగంగా సేకరించడంతో పాటు నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇలాంటి సేవలు గ్రామీణ ప్రాంత ప్రజలు, మహిళలు, వృద్ధులకు ఎంతో ఉపయోగకరమని, బాధితులకు తక్షణ సహాయం అందించడమే లక్ష్యమన్నారు. ఎలాంటి సంఘటన జరిగినా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని, డయల్ 100 ద్వారా సమాచారం అందిస్తే పోలీసులు మీ వద్దకే చేరుకుని సేవలు అందిస్తారని ఎస్పీ పేర్కొన్నారు.

**కౌటాల లో ఆన్ సైట్ ఎఫ్ఐఆర్ నమోదు**

కౌటాల పోలీస్ స్టేషన్ పరిధిలోనీ గుడ్లబోరి గ్రామానికి చెందిన ఓ మహిళ తన ఇద్దరు కుమార్తెలపై అల్లుడు టెస్టర్ తో దాడి చేసిన ఘటనలో సోమవారం రాత్రి 8 గంటలకు డయల్ 100కు ఫిర్యాదు అందింది. సమాచారం అందుకున్న బ్లూకోల్ట్ సిబ్బంది రమేష్, రాకేష్ లు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఎస్ హెచ్ ఓ చంద్రశేఖర్‌కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికే చేరుకుని ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదు తీసుకొని సంఘటన స్థలంలోనే ఆన్ సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అనంతరం అక్కడే వారికీ ఉచితంగా పిర్యాదుదారులకు ఎఫ్ఐఆర్ కాపీ అందజేశారు. తెలంగాణ పోలీస్ శాఖ ప్రజల భద్రత, సౌకర్యం కోసం ఇలాంటి వినూత్న సేవలను మరింతగా అమలు చేయడానికి కట్టుబడి ఉందని ఎస్పీ తెలిపారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com